ఉష్ణోగ్రత (అంచనా)

26-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	28
తెనాలి	34	28
నరసరావుపేట	34	26
బాపట్ల	34	27
రెంటచింతల	35	27
చీరాల	34	27

పన్నుల ఆదాయం పెరగాలి

- మరో 20 శాతం పెరగాలని ఆదేశాలు
- ప్రజలపై భారం వేయకుండా రాబట్టాలని సూచన
- ఆస్తి పన్ను పునఃపరిశీలనకు ఇంటింటి సర్వేకు అధికారులు సిద్ధం
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రూ.52 కోట్లు పెరగాలని టార్గెట్

మున్సిపాల్టీలకు ప్రభుత్వం లక్ష్యం



పురపాలక సంఘాలు పన్నుల ఆదాయం పెంచుకోవాలి. స్వయం సమృద్ధి సాధించాలి. ఇప్పుడు ఉన్న పన్నుల ఆదాయం మరో 20 శాతం వరకు పెరగాల్సిందే. ఇందుకు అవసరమైన మార్గాలను అన్వేషించండి.. అని ప్రభుత్వం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రజలపై భారం వేయకుండా ఆదాయాన్ని రాబట్టాలని నిర్దేశించింది. దీంతో ఆస్తి పన్ను పునఃపరిశీలనకు ఇంటింటి సర్వేకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలతో సిద్ధమయ్యారు. అయితే గతంలో పన్నుల మదింపులో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. వాటిని గుర్తించి పన్నులను సరి చేస్తే మున్సిపాల్టీలకు ఇబ్బడిముబ్బడిగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదంటే గతంలో మాదిరిగా అక్రమాలకు, ఒత్తిళ్లకు లోనవుతారో చూడాలి. మొత్తం మీద గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల ఆదాయం రూ.52 కోట్లు వరకు పెరగనున్నది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీలు స్వయంగా ఆర్థిక ప్రతిపత్తిని సాధించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిధుల కోసం ప్రభుత్వం వైపు చూడకుండా ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించింది. ఈ క్రమంలో ఇక ప్రతి మున్సిపాల్టీ ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్ను ఆదాయాన్ని 20 శాతం పెంచుకోవాల్సిందే. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను ద్వారా వార్షిక ఆదాయం రూ.258.95 కోట్లు ఉంది. ఈ మొత్తంపై 20 శాతం ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్ధేశించింది. ఈ మేరకు రూ.51.79 కోట్లు ఆదాయం పెరగాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో పురపాలకులు ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఆస్తి పన్నుకు సంబంధించి సమగ్ర పరిశీలన చేస్తున్నారు.

లక్ష్యం ఇలా..

- గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్ సహా మున్సిపాల్టీలో ఆస్తి పన్ను వార్షిక ఆదాయం రూ.185.31 కోట్లు ఉంది. దీనిపై మరో 20 శాతం ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రూ.37.06 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.
- పల్నాడు జిల్లాలో ఆస్తి పన్ను ఆదాయం రూ.47.01 కోట్లు కాగా మరో రూ.9.40 కోట్లు పెంచుకోవాలి.
- బాపట్ల జిల్లాలో 26.63 కోట్లు ఉండగా 5.32 కోట్లు పెరగాలి.

గతంలో అనేక అక్రమాలు..

మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. పన్ను మదింపులో గతంలో మున్సిపాల్టీల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పన్ను వసూళ్లకు గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. భవనం, ఖాళీ స్థలం కొలతలు ఆన్‌లైన్‌లో పొందు పరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఆన్‌లైన్ విధానం వల్ల అక్రమాలు జరగవని భావించింది. అయితే కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేయడంతో పన్ను తక్కువగా నమోదైందని ప్రభుత్వం నిర్ధారించింది. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. దీంతో ఆస్తి పన్ను లోపాలను గుర్తించేందుకు మున్సిపాల్టీల్లో కసరత్తు జరుగుతోంది. అలాగే ఇంటి కోసం నిర్మించిన భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై ఆ తర్వాత కట్టడాలు వంటివి చోటు చేసుకున్నాయి. వీటన్నింటిపై మున్సిపాల్టీలు దృష్టి సారించాయి. ఇందుకోసం మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక బృందాలను నియమించాయి. పట్టణాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి పన్ను విధింపులో చోటు చేసుకున్న లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి ఆదాయాన్ని పెంచుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. అన్‌అసైన్డ్, అండర్ అసైన్డ్ భవనాలను గుర్తిస్తున్నారు. ఇంటింటి సర్వేను వచ్చే నెల 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సర్వేకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు రోజు వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆక్సిజ..నై

- ఆస్పత్రుల్లో ప్లాంట్లు అలంకారప్రాయం
- మరమ్మతులు నోచుకోక ఏళ్లుగా నిరుపయోగం
- టెక్నీషియన్ల కొరతతో కొరవడిన ప్లాంట్ల నిర్వహణ
- ఏరియా వైద్యశాలల్లో ప్రైవేటు ఆక్సిజన్‌కే పెద్దపీట
- వెలుగుచూస్తోన్న కరోనా..
- ప్లాంట్లు సిద్ధమయ్యేనా?
- గతంలో ఆక్సిజన్ అందకే పెద్దసంఖ్యలో మరణాలు

నాలుగేళ్ల క్రితం ప్రపంచాన్ని కరోనా వణికించింది. అలాంటి కరోనా కేసులు ఆనవాళ్లు ప్రస్తుతం మళ్లీ రాష్ట్రంలో అక్కడక్కడ వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. అయితే వైరస్ వ్యాప్తి చెందితే చికిత్సలకు ఆస్పత్రుల్లో సౌకర్యాలు ఉన్నాయా అంటే గుంటూరు, బాపట్ల, పల్నాడు లోని పలు ఏరియా ఆస్పత్రుల్లో అనుమానమే. గతంలో కరోనా సమయంలో ఎక్కువ మంది ఆక్సిజన్ అందకే మరణించారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఆక్సిజన్ ప్లాంట్లు ఏరియా ఆస్పత్రుల్లో ఉన్నాయా అంటే.. పేరుకు మాత్రమే ఉన్నాయి. మరమ్మతులు, నిర్వహణ లేక మూలనపడి ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో అత్యవసరంగా ఉపయోగపడే ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బాపట్ల ఏరియా ఆసుపత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

(బాపట్ల, రేపల్లె, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గతంలో కరోనా సమయంలో అప్పటి అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్లు అలంకారప్రాయంగా మారాయి. పలు ఆస్పత్రుల్లో రెండు నుంచి మూడేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు లేక ఆక్సిజన్ ప్లాంట్లు మూలనపడ్డాయి. స్వల్ప మరమ్మతులతో వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా వైద్య ఆరోగ్య శాఖ కనీస చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడంలేదు. కరోనా సమయంలో గత ప్రభుత్వం రూ.కోటి చొప్పున వెచ్చించి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. అయితే ఆ నిధుల వినియోగంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు అప్పట్లో పెద్దఎత్తున వచ్చాయి. ప్రారంభించిన రెండేళ్లకు వాటి నిర్వహణను విస్మరించడంతో ఇవి ప్రస్తుతం పనికిరాకుండా పోయాయి. దీంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ అందించలేకపోతున్నారు. అత్యవసర చికిత్సల సమయంలో 10 శాతం మంది రోగులకి ఆక్సిజన్ అవసరం పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. ఈ పరిస్థితుల్లో కొన్ని ఆస్పత్రుల్లో రోగులు ఆక్సిజన్ కోసం ప్రైవేటు ఏజెన్సీల వైపే చూస్తున్నారు. ఈ ఆక్సిజన్ సిలిండర్ల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని రోగుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. అనేక ఆస్పత్రుల్లో మరమ్మతులతో పాటు ప్లాంట్ల టెక్నీషియన్ల కొరత కూడా ఉంది. ఇక జనరేటర్, ఇతర పరికరాల సంగతి అయితే చెప్పక్కర్లేదు. అవి దాదాపుగా పనికిరాని స్థితిలోనే ఉన్నాయి.



రేపల్లె : ప్రభుత్వ వైద్యశాలలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

ఆదుకుంటోన్న కాన్సంట్రేటర్లు

ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా మారడంతో పలు ఏరియా ఆస్పత్రుల్లో రోగుల అవసరాలు తీర్చేందుకు కాన్సంట్రేటర్లే దిక్కవుతున్నాయి. ఒక్కో దానిలో ఐదు లీటర్ల కెపాసిటీ మాత్రమే ఉంటుంది. అత్యవసర వైద్య సేవల సమయంలో ఇది సరిపోక అనేకఅవస్థలు పడాల్సి వస్తోంది. బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లెలోని ఏరియా ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. బాపట్లలోని ప్లాంట్ మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉంది. చీరాలలో మరమ్మతులతో పాటు సిబ్బంది కొరత కూడా నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో దాతల సహకారంతో రేపల్లెలో నిర్మించిన ప్లాంటుకు సంబంధించి విడి పరికరాలు పని చేయడం లేదు. కంప్రెషర్ సమస్య ఉంది. సంవత్సరం నుంచి ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది.

నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ నెలల తరబడి పనిచేయడం లేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టే నాటికే ప్లాంట్ పనిచేయడంలేదని చెప్పారు.



నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

కార్యకర్తలకు.. న్యాయం చేస్తాం

- పార్టీ శ్రేణుల శ్రమతోనే అఖండ విజయం
- జిల్లా మహానాడులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం, పార్టీ విజయం కోసం ప్రాణాలొడ్డి నిలిచిన ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా మహానాడు జరిగింది. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పెమ్మసాని ప్రసంగిస్తూ అన్న ఎన్టీఆర్ ఆశయాలే కార్యకర్తలకు ధైర్యమని, ఎన్టీఆర్‌ని మించిన మొనగాడు ఈ భూమి మీద పుట్టలేదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఎదుర్కొని ధైర్యంగా నిలబడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల అరాచక పాలనలో ఎన్నో దారుణాలు చూశామని, రాష్ట్రం అప్పులపాలైపోయిందని తెలిపారు. అరాచక శక్తిని పారదోలి అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలను పార్టీ మరువదన్నారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో లీగల్ టీం ద్వారా కార్యకర్తలపై నమోదైన 240 కేసులు తొలగించేలా చేశామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ 164 సీట్లతో గెలిపించిన ప్రతి కార్యకర్తకు పార్టీ రుణపడి ఉంటుందన్నారు. టీడీపీ అంటేనే సంక్షేమమని గుర్తుచేశారు. ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, గుంటూరు కార్పొరేషన్ మేయర్ నాని మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని, న్యాయం జరుగుతుందని చెప్పారు.

ధూళిపాళ్ల ఆవేదన..

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కార్యకర్తలకు తగిన న్యాయం జరగడం లేదని పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. 2014- 19 మధ్య నరేగా పనులు చేసిన కార్యకర్తలకు ఈ రోజుకూ బిల్లులు రాలేదని, కానీ గత ఐదేళ్లలో చేసిన అనేక మందికి బిల్లులు వచ్చాయని తెలిపారు. కార్యకర్తలకు, కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలు ఇప్పించేలా కేంద్ర మంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యకర్తల స్థాయిలో వారికి పోరాటం చేయడం కష్టంగా ఉంటుందని, ఎమ్మెల్యేలు, మంత్రులు చొరవ తీసుకుని కార్యకర్తల తరపున నిలవాలని కోరారు. మనం ఎదుర్కొన్న సమస్యలు, పోరాటాలను, ఇబ్బందులను మర్చిపోతే మనకి, పార్టీకి మనుగడ ఉండదని గుర్తు చేశారు. జెండా పెట్టుకున్నందుకే గ్రామ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలపై కేసులు ఉన్నాయని తెలిపారు. అనంతరం రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నవారికి సభ్యత్వ కార్డులు అందించారు. అనంతరం జిల్లా మహానాడు 19 తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యరావు, నేతలు ఏఎస్ రామకృష్ణ, నన్నపనేని రాజకుమారి, దాసరి రాజా మాష్టారు, తాడిశెట్టి మురళీమోహన్, కసుకుర్తి హనుమంతరావు, మల్లె ఈశ్వరరావు, సుఖవాసి శ్రీనివాసరావు, మానుకొండ శివప్రసాద్, దామినేని శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, నిమ్మల శేషయ్య, కనకాచారి, వందనాదేవి, తాళ్ల వెంకటేష్, లాల్ వజీర్, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, వీ.హరిబాబు, జయలక్ష్మి, వెంకటరత్నం, జానీబేగం, ముత్తినేని రాజేష్, అబ్దుల్ గని, చుక్కపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





జిల్లా మహానాడులో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, హాజరైన నాయకులు, కార్యర్తలు

రహదారుణాలకు సంపూర్ణ పరిష్కారం

- మూడు జిల్లాల్లో 16 రోడ్లకు మరమ్మతులు
- రూ.44.3 కోట్లు కేటాయించిన ఆర్అండ్‌బీ శాఖ
- కిందటేడాది నవంబరులోనే బాగుపడిన రోడ్లు
- అప్పట్లో రూ.640 కోట్లతో మరమ్మతులు
- తాజాగా మిగిలిన పనులు..

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రహ'దారుణాలకు' కూటమి పూర్తి పరిష్కారం చూపుతోంది. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల ప్రక్రియ జిల్లాలో వేగంగా కొనసాగుతోంది. తొలి విడతగా కిందటేడాది అక్టోబరులో మూడు జిల్లాల్లో ప్యాచ్ వర్క్‌లు, తక్షణ మరమ్మతుల కోసం రూ. 35 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఆ వెను వెంటనే మరమ్మతుల కోసం గుంటూరు జిల్లాకు రూ.559.8 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.72 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.4.86 కోట్లు కేటాయించిం ది. దీంతో జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా వరకూ మెరుగుపడింది. అయితే ఇప్పటికీ పలు రోడ్ల పరిస్థితి సమస్యాత్మకంగా ఉంది. రాష్ట్ర రహదా రులు, భవనాల శాఖ మరోమారు రహదారుల మరమ్మతులపై దృష్టి సారించింది. మూడు జిల్లాల్లో 16 రహదారుల మరమ్మతుల నిమిత్తం రూ.44.3 కోట్లు మంజూరు చేసింది. ఏడు రాష్ట్ర రహదారులకు రూ.26.9 కోట్లు, ఏడు మేజర్ జిల్లా రహదారులకు రూ. 17.4 కోట్లు కేటాయించింది.


రాష్ట్ర రహదారులకు రూ.26.9 కోట్లు

గుంటూరు జల్లాలో.. గుంటూరు- అమరావతి రోడ్డు మరమ్మతులకు రూ.6.5 కోట్లు, తెనాలి- నారాకోడూరు రోడ్డుకు రూ.4 కోట్లు, గుంటూరు- చీరాల రహదారికి రూ. 2 కోట్లు మంజూరు చేసింది. బాపట్ల జిల్లాలో అద్దంకి- సంతమాగులూరు రోడ్డుకు రూ.4 కోట్లు, రేపల్లె- పిట్టల వానిపాలెం రోడ్డుకు రూ.200 కోట్లు, పల్నాడు జిల్లా వినుకొండ- ముప్పరాజు వారిపాలెం రోడ్డుకు రూ.కోటి, నకరికల్లు- గురజాల రూ.40 లక్షలు, సత్తెనపల్లి- మాదిపాడు రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేయడం జరిగింది.

జిల్లా రోడ్లకు రూ. 17.4 కోట్లు

గుంటూరు జిల్లా పొన్నూరు నియోజక వర్గంలోని పెదకాకాని- వెనిగండ్ల రహదారి మరమ్మతులకు రూ. 3.5 కోట్లు, పల్నాడు జిల్లాలోని కొండ్రముట్ల- బండ్లమోటు- దుర్గి రోడ్డుకు రూ.5 కోట్లు, పెద కూరపాడు- బయ్యవరం రోడ్డుకు రూ. 2.05 కోట్లు, నుదురుపాడు- బోయపాలెం రోడ్డుకు రూ.1.4 కోట్లు, బాపట్ల జిల్లాలోని ఐఎం రోడ్డు నుంచి జాతీయ రహదారి అనుసంధానం అభివృద్ధికి రూ.కోటి, బల్లికురవ నుంచి జాతీయ రహదారి అనుసంధానానికి రూ.2.40 కోట్లు, బేతపూడి- రావిఅనంతవరం వయా మోర్లవారి పాలెం, పేటేరు రోడ్డుకు రూ.2.05 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రథమాంధ్ర మహా సభలకు 112 వసంతాలు



1913లో ప్రథమాంధ్ర సభలో పాల్గొన్న ప్రముఖులు

బాపట్ల, మే 25(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధి కోసం, తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించడంలో బాపట్ల ప్రాంతానికి చెందిన ఎందరో మహనీయులు తమ వంతు కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్లలో 1913 మే 26న జరిగిన ప్రథమాంధ్ర మహా సభలు ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు ముత్యా ల పందిరి వేశాయి. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు బీజం ఇక్కడే పడింది. మన ఆంధ్ర బాష, సంస్కృతి, ఆంధ్రోద్యమానికి బాపట్ల పురిటిగడ్డ లాంటిది. తెలుగువారి ఆత్మాభిమానాన్ని, ఐకమత్యాన్ని సమాజానికి చాటి చెప్పింది ఈ ప్రథమాం ధ్ర మహా సభ. అనాటి ప్రముఖ దేశభక్తులు, భాషా శాస్త్రవేత్తలు, మేధావుల సమక్షంలో మహా సభ జరగడం చరిత్రలో ఒక మరుపురాని ఘటంగా నిలిచిపోయింది. నాటి మహాసభ తీర్మానాలను అనుగుణంగా ఆంధ్ర భాష అమలుకు ప్రభుత్వాలు చేసిన కృషి ఫలితంగా భాషా చరిత్రలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. బాపట్ల టౌన్ హాల్‌లో ఈ ప్రథమాంధ్ర మహా సభలు 112 సంవత్సరాలు క్రితం జరిగాయి. బి.ఎన్.శర్మ, వ్యాపతి సుబ్బారావు, కొండా వెంకటప్పయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, పింగళి వెంకయ్య, మట్నూరి కృష్ణారావు, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, ఎన్.రామచంద్రరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలైన మహానుభావులు ఈ మహాసభను ముందుండి నడిపించారు. ఆంధ్ర రాష్టానికి కృషి చేసిన మహనీయులు స్ఫూర్తితో, త్యాగంతో అవిర్భవించిన ఆంధ్రరా ష్ట్రం అదే స్ఫూర్తితో తెలుగు భాషా సంస్కృతులను కాపాడుకోవడటానికి కృషి చేయాల్సిన అవసరం మరింతగా ఉందని ఈ మహా సభలు ఆనాడు వెల్లడించాయి. బాపట్ల ప్రాంత కవులు, రచయితలు తెలుగు భాషాబివృద్ధి కోసం తమవంతు కృషి చేశారు. ఆయా మహనీయులను ఈ ప్రథమాంధ్ర మహాసభ 112వ వసంతోత్సవంలో స్మరించుకోవడం ఎంతైన అవసరం. వారి ఆశయాలను కొనసాగించడం మనందరి కర్తవ్యం.

1న మోడల్ లా-సెట్

గుంటూరు(తూర్పు), మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న రాష్ట్రస్థాయి మోడల్ లా-సెట్ ఉచిత పరీక్ష నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కా శీనయ్య, కార్యదర్శి నక్కల నాగరాజు యాదవ్, కన్వీనర్ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్యామాల నగర్, మాంటిస్సోరి పాఠశాలలో ఈ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పేర్లు నమోదు కోసం అభ్యర్థులు 82974 83785 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

తీరం తాకిన సంతోషం

● సూర్యలంకలో పర్యాటకుల సందడి ● వేసవి సెలవులు, ఆదివారంతో పోటెత్తిన ప్రజలు

బాపట్ల,మే 25 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలువులు, ఆదివారం సంతోషం సూర్యలంక సముద్ర తీరం తాకింది. ప్రముఖ పర్యాటక కేంద్రం పర్యాటకులతో పోటెత్తింది. సముద్ర స్నానాలు.. ఇసుక తిమ్మెర్ల ఆటలతో ఆనందం ఎగసిపడింది. గుర్రాలు, ఒంటెలు,





ఇసుకలో చిన్నారుల ఆటలు

బైక్ రైడ్స్‌తో యువత కేరింతలు కొట్టారు. పర్యాటకులకు అన్ని రకాల వసతులు, ఆహార పదార్థాలు అందుబాటులో ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే సేద తీరారు. వేసవి సెలవులు కావడంతో పర్యాటకులు అధికంగా సూర్యలంక బాటపడుతున్నారు. మెరైన్, రూరల్ పోలీసులు, గజ ఈతగాళ్లతో గస్తీ నిర్వహించారు.

పాలనంటే ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన

❖ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తాడికొండ(రావెల)మే 25(ఆంధ్రజ్యోతి): పాలనంటే ప్రజలకు మౌలిక సదుపాయాలైన రోడ్లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం, చెరువులు తవ్వించడం, మంచి నీరు అందించేలా ఉండాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం తాడికొండ మండలం రావెల గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ బీసీ కమ్యూనిటీ హాలు ఎన్నాళ్ల నుంచో రావెల గ్రామం కల అని తెలిపారు. దాతలు సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, కల్యాణి ప్రసాద్ సహకారంలో రూ.40 లక్షల వ్యయంతో హాలును నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. భవనం నిర్మాణానికి సహయం చేసిన వారిది ఒంగోలు జిల్లా అని ఆయన తనకు 15 సంవత్సరాలుగా సుపరిచితుల న్నారు. తనను నమ్మి రూ.4 కోట్లు విరాళం ఇచ్చారని తెలిపారు. పది గ్రామాల్లో బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను దాతల సహయంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తాడికొండ నియోజకవర్గానికి మూడు అందిస్తున్నట్లు చెప్పారు.గడిచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి కల్తీ మందు పోసి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడారని పెమ్మసాని విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బటన్ నొక్కడం తప్ప ఆయన ఏమీ చేయలేదన్నారు. జలజీవన్ మీషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.14 వేల కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కానీ, జగన్ రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి.. మిగిలిన రూ. 12 వేల కోట్లు మురిగిపోయే విధంగా చేశారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు జలజీవన్ మీషన్ నిధులు రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రావెల గ్రామా



రావెలలో బీసీ కమ్యూనిటి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

నికి గతంలో ఎమ్మెల్యేగా రూ.4 కోట్లు నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధి పాటుపడ్డామన్నారు. ప్రతి శుక్రవారం సమ స్యల పరిష్కారానికి తన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ రావెల శైలజా, మాజీ వైస్ ఎంపీపీ దగ్గుమల్లి శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు గుణవర్ధనరావు, బీసీ సెల్ నాయకులు పల్లా కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్ర రావు, నీటి సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి మధుసూదనరావు, బీసీ సెల్ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిగురుపాటి అనూప్, చిమటా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై కఠిన చర్యలు తప్పవు : పల్లా, జీవీ

వినుకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి, ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. మాచర్లలో టీడీపీ నాయకులను హత్య చేసిన వారిని వదిలిపెట్టబోమని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడప వేదికగా జరగబోతున్న మహానాడు ఏర్పాట్ల వివరాలను పల్లా, జీవీ ఆదివారం వివరించారు. పులివెందులలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాచర్లలో తెలుగుదేశం పార్టీ నాయకుల హత్యను తీవ్రంగా ఖండించారు. నేర ప్రవృత్తిని అరికట్టాల్సి ఉందన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు చేసినట్లే పిన్నెల్లి బ్రదర్స్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలు చేసేవారు, ప్రజా ధనాన్ని లూటీ చేసేవారు ఎప్పటికైనా జైలుకు వెళ్లక తప్పదన్నారు. ఇటీవల గాలి జనార్దన్‌రెడ్డి కేసే ఇందుకు నిదర్శనమన్నారు. రాయలసీమలో అది కూడా కడపలో మొదటిసారి మహానాడు ఎంతో ఆనందంగా అనిపిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అవినీతి, ఫ్యాక్షన్ తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పూర్తి చేసిన ప్రాజెక్టులు తప్ప జగన్ పాలనలో కడప, పులివెందులలో కొత్తగా ఒక ఎకరానికైనా నీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమ, కడప ప్రాంతంలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పక్కన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ తదితరులు

ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కడప మహానాడుకు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలపాలని ఈ సందర్భంగా జీవీ కోరారు. పార్టీ ఆదరణ ఏ స్థాయిలో ఉందో చెప్పాలని ఈ సందర్భంగా వారిద్దరు టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జెవిశెట్టి సోదరులకు కన్నీటి వీడ్కోలు

● అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి, టీడీపీ శ్రేణులు

మాచర్లటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యర్థుల దాడిలో హత్యగావింపబడిన వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, సోదరుడు కోటేశ్వరరావుకు టీడీపీ నేతలు అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఆదివారం మృతదేహాలను పోస్టుమార్టం బంధువులకు అప్పగించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దగ్గరుండి ఈ కార్యక్రమాలు పర్యవేక్షించారు. బంధువులు మృతదేహాలను స్వగ్రామమైన గుండ్లపాడుకు తీసుకెళ్లారు. ఒకే సంఘటనలో అన్నదమ్ములిద్దరూ హత్యకు గురికావడంతో.. కుటుంబ సభ్యులు, బంధువులు, టీడీపీ శ్రేణులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని భరోసానిచ్చారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను చట్ట ప్రకారం శిక్షిస్తాం

గుండ్లపాడు టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావును రాజకీయ కక్షతో హతమార్చిన ఘాతుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే పరిస్థితి లేదని జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. హత్యలో పాల్గొన్న, తెర వెనుక తోడ్పడిన ప్రతి ఒక్కరికీ చట్టప్రకారం శిక్షపడేలా చూస్తామన్నారు. సత్వర విచారణ జరిపి పాత్రధారులను, సూత్రదారులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పోలీసులను డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న పికెటింగ్

వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జంట హత్యల నేపథ్యంలో ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఆదివా రం సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అందులో ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 136 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు.





జెవిశెట్టి సోదరుల అంతిమయాత్ర (ఇన్‌సెట్లో) పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మంగళాద్రి సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

● లక్ష్మీనృసింహుని దర్శించుకున్న దేవదాయ శాఖ కమిషనర్

మంగళగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ దేవదాయ శాఖ కమిష నర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం కుటుంబ సమేతంగా మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువ సన్నిధిలోని తూర్పు రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కమిషనర్ కుటుంబ సభ్యులు లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కృష్ణదేవరాయ ముఖ మండపంలో అర్చకస్వాములు ఆశీర్వచనాలను అందజేశారు. దేవదాయ శాఖ సహాయ కమిషనరు, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి నృసింహుని చిత్రపటంతో కూడిన జ్ఞాపికను కమిషనర్ రామచంద్రమోహన్‌కు బహూకరించారు.

నృసింహాలయ అభివృద్ధికి ప్రణాళికలు

పురాతన వైష్ణవ క్షేత్రాల్లో ఒకటైన మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఏపీ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ తెలిపారు. ఆదివారం నృసింహుని దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నృసింహాలయం ప్రాకారం లోపల పురాతన కట్టడాలకు రక్షణ చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.ఆలయ ప్రాంగణంతోపాటు క్షేత్ర ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేసేలా మంగళాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారని చెప్పారు. మంగళాద్రి క్షేత్రానికి చేరుకునే రోడ్లు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఎగువ, దిగువ సన్నిధులకు సంబంధించి ప్రణాళికలు తయారవుతున్నాయన్నారు. అన్ని దేవాలయాల్లోనూ భక్తులందరికీ అపరిమితంగా అన్న ప్రసాద వితరణ చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని, దేవాదాయ శాఖ నిధులు, భక్తుల సహకారంతో త్వరలోనే పూర్తిస్థాయిలో ఆ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. 2027 గోదావరి, 2028 కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని వందలాది ఆలయాలను అవసరాన్ని బట్టి అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు.



దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో రామకోటిరెడ్డి

సీసాలో మంచం : మన కార్పెంటర్ కళ

మాచవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇదీ మన విశ్వకర్మ కళ. చేతివృత్తి విరామంలో తన పనితనానికి పదును పెట్టి.. సరదాగా ఇలా గాజు సీసాలో మంచా న్ని పట్టించేశారు. ఇలాంటి కళకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉంది. మోర్జం పాడు గ్రామానికి చెందిన కొండోజు కృష్ణమాచారి 50 ఏళ్లుగా కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. వ్యవసాయ పరికరాలు, గృహ ధరవాజ్‌లు, తలుపులు, కిటికీలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పని లేని సమయంలో.. తన కళకు పదును పెట్టి.. గాజు సీసాలో మంచం తయారు చేశారు. ముందుగా గాజు సీసాలోకి మంచానికి కావాల్సిన కోళ్లు, పట్టెలను ప్రవేశ పెట్టానని, తర్వాత ఒక ఊస, శ్రావణంతో పట్టెలకు కోళ్లు బిగించి మంచం ఆకారాన్ని తీసుకు వచ్చానని ఆయ తెలిపారు. సూది, దారంతో మంచాన్ని అల్లిక చేశానని చెప్పారు. ఇలాంటివి నాలుగు తయారు చేశానని, మోర్జంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ల్యాబ్‌లో ఉపాధ్యాయులు ఒకటి ఏర్పాటు చేశారన్నారు. మరొకటి గ్రామంలో ఓ షాపునకు ఇవ్వగా.. రెండు తమ కుటుంబ సభ్యులు తీసుకెళ్లారని తెలిపారు.



కొండోజు కృష్ణమాచారి



గాజు సీసాలో దారంతో మంచం తయారు చేసిన దృశ్యం

టీడీపీ కార్యకర్తల హత్య కలిచివేసింది

● పార్టీ పల్నాడు అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : పల్నాడులో టీడీపీ కార్యకర్తల హత్య కలిచివేసిందని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ప్రశాంతమైన పల్నాడులో మళ్లీ ఫ్యాక్షన్ రాజేసేలా పిన్నెల్లి చేష్టలు ఉన్నాయని, ప్రాణాలు కోల్పోయిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. టీడీపీ కార్యక ర్తలు జవిశెట్టి వెంకటేశ్వరరావు, జవిశెట్టి కోటేశ్వరరావును వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణరెడ్డి అనుచరులే అత్యంత దారుణంగా హతమార్చారని, పిన్నెల్లి సన్నిహితుడిగా జెవిశెట్టి శ్రీనివాస్ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని పేర్కొన్నా రు.ఏడాదిగాపల్నాడు జిల్లాలో నెలకొన్న ప్రశాంతమైన వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసేలా పిన్నెల్లి వ్యవహరిస్తున్నారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పిన్నెల్లిని, అనుచరులపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

31న మెగా జాబ్ మేళా

● 25 కంపెనీలు, 1,500 ఉద్యోగ అవకాశాలు

వినుకొండటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ విభాగం ఆధ్వర్యంలో వినుకొండ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 25 కంపెనీలు ద్వారా 1,500 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నియోజకవర్గంలోని నిరుద్యోగులకు జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో టాటా, మహీంద్ర, ఏజీటీఆర్ఎస్ ఇడార్ట్, అపెక్స్ సొల్యూషన్, పెయిర్ సాఫ్ట్ సొల్యూషన్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ కార్డ్స్, ఎస్‌బీఐ చెల్లింపులు, మాస్టర్ మైండ్స్ ముత్తూట్ ఫైనాన్స్, వరుణ్ మోటార్స్ (అమరరాజా గ్రూప్), హెట్ డ్రగ్స్, పేటీఎం, ఎల్అండ్‌టీ ఫైనాన్స్, ఫ్లిప్ కార్ట్, కేఎల్ టెక్నాలజీ సర్వీస్, ఎస్ఎస్ ఇన్‌వెస్ట్‌మెంట్స్, డైకిన్, ఇవాంగిల్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు చీఫ్‌విప్ కార్యాలయం 77805 73053, జానీబాషా 9951214919, కంట్రోల్ 9988853335 నంబర్లను సంప్రదించి వెబ్‌సైట్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

పది మూల్యాంకనంలో తప్పిదం

● రీకౌంటింగ్‌లో అదనంగా 15 మార్కులు

గుంటూరు (విద్య) మే 25 (ఆంధ్రజ్యో తి): పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై ఇప్ప టికే అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి ఫిర్యాదులను నిజం చేస్తూ.. నగరంలోని ఓ పాఠశాల నుంచి పదవ తరగతి పరీ క్షలకు హాజరైన విద్యా ర్థినికి సాంఘిక శా స్త్రంలో మొత్తం 81 మార్కులు వచ్చినట్లు మెమోలో నమోదు అయింది. దీంతో సదరు విద్యార్థిని రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకుంది. విద్యార్థినికి జవాబు పత్రం బుక్‌లెట్‌ను జిరాక్స్ రూపంలో అందజేశారు. అయితే కూడిక విషయంలో చేసిన పొరపాటు బయటపడింది. కాలం 2లో 18 మార్కులకు గాను 17 మా ర్కులు, కాలం 2లో 46 మార్కులకు గాను 32 మార్కులు వేశారు. 96 మార్కులకు గాను 81 మార్కులు వచ్చినట్లు నమోదు చేశారు. 15 మార్కులు తక్కువ వేసినట్లు విద్యార్థిని జవాబు పత్రంలో వెల్లడయింది. రీకౌంటింగ్‌లో 96 మార్కులుగా నమోదు చేశారు.



బుక్‌లెట్‌లో కూడికలో తప్పు వేసిన మార్కులు

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



అలపర్తి సైదారావు(ఫైల్)

అచ్చంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గింజుపల్లి వద్ద కృష్ణా నదిలో స్నానానికి దిగి నకరికల్లు మండలం చాగల్లు గ్రామానికి చెందిన అలపర్తి సైదారావు ఆదివారం గల్లంతయ్యాడు. సైదారావుతో పాటు 15 మంది మాది పాడు అటవీ ప్రాంతంలో ఉన్న సత్తెమ్మగుడిలో మొక్కుబడులు చెల్లించుకుని.. తిరుగు ప్రయాణంలో అందరూ గింజుపల్లిలోని కృష్ణానదిలో స్నానానికి దిగారు. సైదారావు ఈత కొట్టుకుంటూ లోనికి వెళ్లి.. తిరిగి రాలేక గల్లంతయ్యాడు. స్థానికుల సహాయంతో పోలీసులు సైదారావు కోసం గాలింపు చేపడుతున్నారు. పొద్దు పోయేంత వరకు సైదారావు ఆచూకీ లభించలేదు. అచ్చంపేట సీఐ శ్రీనివాస్ పడవల ద్వారా జల్లెడ పట్టారు. రాత్రి యువకుడి మృతదేహం లభ్యం కావడంతో.. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సైదారావుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మంగళగిరి యువకుడిపై పీడీ యాక్ట్

మంగళగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులపై పోలీసులు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. మంగళగిరి పట్టణం బాప్టిస్టు పేటకు చెందిన బుల్లా మనోజ్ అలియాస్ సన్నీపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, ఎస్పీ సతీశ్‌కుమార్ ఆదేశాల మేరకు మనోజ్‌ను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణ, కొట్లాటలు, దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్యాయత్నాల కేసుల్లో నిందితులుగా పోలీసు రికార్డుల్లోకి ఎక్కితే పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరిం చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగించే ఎవరికైనా శిక్ష తప్పదన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6498 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

● హాజరుకానున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(తూర్పు), మే 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇకపై ఈ కార్యక్రమాన్ని గోల్డెన్ డేగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని ఆయా కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలని సూచించారు. శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగే కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

బ్రెయిన్ ట్యూమర్లను నిర్లక్ష్యం చేయవద్దు

● న్యూరో సర్జన్ డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి

గుంటూరు మెడికల్, మే 25 (ఆంధ్రజ్యోతి): తల నొప్పి, వాంతులను నిర్లక్ష్యం చేయవద్దని, ఇలాంటి చిన్న లక్షణాలే.. బ్రెయిన్ ట్యూమర్ వంటి పెద్ద జబ్బులకు సూచికలని న్యూరో సర్జన్ డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి తెలిపారు. బ్రెయిన్ ట్యూమర్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మే నెలను 'గో గ్రే ఇన్ మే' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని న్యూరో క్యూర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రెయిన్ ట్యూమర్ అవగాహన కోసం ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నగరంలోని ప్రముఖ న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్లతో బాధపడే వారిలో ఉదయం విపరీతంగా తలనొప్పి ఉంటుందని, వాంతి అనంతరం ఈ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుందని వివరించారు. ఇటువంటి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యనిపుణులను కలసి తగిన చికిత్సలు పొందాలని ఆయన సూచించారు. సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వీఆర్ తారకనాద్ మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్లను తొలి దశలో గుర్తించి తగిన చికిత్సలు అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్టులు డాక్టర్ పవన్ చెరుకూరి, డాక్టర్ హరిత చౌదరి, డాక్టర్ నవీన్ వందనపు, డాక్టర్ లక్ష్మీప్రియ చదలవాడ, డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి పాల్గొన్నారు.



బ్రెయిన్ ట్యూమర్ అవగాహన ర్యాలీలో న్యూరాలజిస్టులు

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించండి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నుంచి రక్షణకు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒకటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని ఆమె సూచించారు. వ్యాక్సిన్‌ల కోసం ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం మూడు విడతల్లో జరుగుతుందని ఆమె చెప్పారు. తొలి విడతగా మే 26వ తేదీ నుంచి 31 వరకు, రెండో విడత జూన్ 23 నుంచి 28వ తేదీ వరకు, మూడో విడత జూలై 21 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని ఆమె వెల్లడించారు. 9 నుంచి 12 నెలల్లోపు పిల్లలకు మొదటి డోసు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. 16 నెలల నుంచి 24 నెలల్లోపు పిల్లలకు రెండో డోసు వ్యాక్సిన్ వేయించాలన్నారు. జిల్లాలో మొదటి డోసుకు 6477 మంది పిల్లలను అర్హులుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. రెండో డోసుకు రూ.12,941 మంది పిల్లలు అర్హులుగా గుర్తించినట్లు వివరించారు. ఇక మొదటి రెండు డోసులు వేయించుకోని పిల్లలకు ఐదేళ్లలోపు మూడో డోసు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు.

దేశ సమైక్యతా స్ఫూర్తిని కొనసాగించాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), మే 25 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ఐక్యతా స్ఫూర్తిని రానున్న కాలంలోనూ కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. పహల్గాం దాడి, అనంతరం పాక్‌పై యుద్ధం, అమెరికా ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వరకు సమైఖ్యత యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పహల్గాం దాడిని అడ్డుపెట్టుకొని దేశంలోని కొన్ని శక్తులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. అమెరికా తన అధిపత్యం కోసమే పాక్‌పై భారత్ యుద్ధంలో జోక్యం చేసుకుందని, అమెరికాకు మోదీ లొంగిపోవటం సరికాదన్నారు. భారతదేశంపై ఇతర దేశాల పెత్తనం దేశ సార్వభౌమత్వానికి ప్రమాదమని అన్నారు. సీపీఎం నాయకుడు ఎండీ సలీం మాట్లాడుతూ కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరి అని అభివర్ణించటం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. కార్యక్రమంలో కె.నళినీకాంత్, ఎల్.అరుణ, కె.అజయ్‌కుమార్, బి.ముత్యాలరావు, లక్ష్మణరావు, సత్యనారాయణ, కె.శ్రీనివాస్, జి.రమణ పాల్గొన్నారు.


సమైఖ్యత యాత్రలో పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

కళలతో... సమాజ పురోగమనం : జంగాల

గుంటూరు(తూర్పు), మే 25 (ఆంధ్రజ్యోతి): సమాజ పురోగమనానికి ప్రజా కళలు అత్యంత స్ఫూర్తినిస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో ఆదివారం అఖిల భారత ప్రజానాట్యమండలి 83వ ఆవిర్భావ దినోత్సవం, ప్రముఖ సినిమా హీరో మాదాల రంగారావు 77వ జయంతి సభను నిర్వహించారు. కళాకారుడు సీహెచ్ కృష్ణ జెండాను ఆవిష్కరించగా, కార్యక్రమానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ అధ్యక్షత వహించారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మాభూమి నాటకం ప్రేరణతోనే ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చిన వెంటనే కరణాలను, మునసబులను తొలగించారని గుర్తు చేశారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ఆగష్టులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు, వంద సంవత్సరాల వేడుకల సందర్భంగా వంద మంది కళాకారులతో నూతన కళారూపాలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ కృష్ణ, పులి సాంబశివరావు, ఆర్.రామకృష్ణ, పూర్ణ, ఆరేటి రామారావు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వ్యవస్థ తొలగింపు సాహసోపేత నిర్ణయం

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల చట్టానికి విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం తొలగించడం ఒక సాహసోపేత నిర్ణయమని నగర రేషన్ డీలర్ల సంఘం నాయకుడు తుమ్మల గాంధీ అన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే అమలులోకి తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం నగరంలో ముఖ్యమంత్రి చిత్రపటం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఎండీయూలు అనేక అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. పౌరసరఫరాల వ్యవస్థపై అనవసరంగా రూ.వందల కోట్ల ఆర్థికభారాన్ని గత ప్రభుత్వం మోపిందన్నారు. రేషన్ డీలర్ల వ్యవస్థకు పునరుజ్జీవం పోసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం నాయకులు రాజేశ్వరరావు, జిలాని, బాబు, అశ్విని కుమార్, ముక్తేశ్వరరావు, రమేష్, చిలకా వెంకటస్వామి, ఉమాశంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

పనులు చేతల్లో కనపడాలి

● పారిశుధ్య నిర్వహణపై కార్పొరేటర్లకు పెమ్మసాని దిశా నిర్దేశం

● మేయర్, ఎమ్మెల్యేల సమక్షంలో నగరాభివృద్ధిపై ప్రత్యేక సమావేశం


కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, పక్కన మేయర్ రవీంద్ర, తూర్పు ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్లలో సిల్టు తొలగింపు, కుక్కల బెడద సమస్యకు పరిష్కారం తీసుకురావాలి.. మాటలు కాదు చేతలతో గుంటూరు ప్రజలకు పరిష్కారం చూపాలి.. నెల రోజుల్లోపు గుంటూరులో టీడీపీ మార్క్ అభివృద్ధి కనపడాలి అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. నగరంలో ఎదురవుతున్న పారిశుధ్య సమస్యలు, కార్పొరేషన్ సంబంధిత అంశాలపై పెమ్మసాని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో ఆదివారం ప్రత్యేక సమావేశం జరిగింది. మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ శానిటరీ వర్కర్లతో పని చేయించుకోవడం, నిత్యం పారిశుధ్య పనులపై ప్రత్యేకంగా రెండు గంటలు దృష్టి సారించాలని కార్పొరేటర్లకు ఆయన సూచించారు. నగరంలో కుక్కల బెడద, డ్రెయిన్ల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు మేయర్‌కి కూడా తెలియజేయాలని చెప్పారు.

కాగా తమ డివిజన్లలో వర్కర్లు తక్కువగా ఉన్న కారణంతో పారిశుధ్య నిర్వహణ ఆలస్యం అవుతుందని కొందరు కార్పొరేటర్లు మేయర్‌కి, పెమ్మసాని కి తెలిపారు. ఏఏ వార్డులకు, ఎంత మంది వర్కర్లు కావాలనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని పెమ్మసాని, మేయర్ స్పష్టం చేశారు. అలాగే ప్రతి నెల ఇదే తరహాలో కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించి గుంటూరును ది బెస్ట్ ప్లేస్ సిటీగా మార్చే బాధ్యతను ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపడతామని పెమ్మసాని అన్నారు. ఈ సమావేశంలో పోతురాజు సమత, నూకవరపు బాలాజీ, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం పద్మశ్రీ తదితర టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దర్జీల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

గుంటూరు(తూర్పు), మే 25 (ఆంధ్రజ్యోతి): మనిషి నాగరికతతో ముడి వేసుకున్న టైలరింగ్ వృత్తి కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని నవ్యాంధ్రప్రదేశ్ టైలర్స్ అసోసియేషన్ పూర్వాధ్యక్షుడు వై.వాలేశ్వరరావు అన్నారు. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం, కిరణ్ టైలర్స్ వ్యవస్థాపకుడు పర్చూరి కేశవరావు టైలరింగ్ వృత్తిలో అర్ధ శతాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాలేశ్వరరావు మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తుల సునామీలో టైలరింగ్ వృత్తి నానాటికి కుంచించుకుపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోయ శ్రీనివాసరావు మాట్లాడుతూ కిరణ్ టైలర్స్ సంస్థ ద్వారా వందలాది కుటుంబాలు ఉపాధి పొందటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పేరిశెట్టి శిరీష, పేరిశెట్టి శ్రీనివాసరావు, పోరుమల్ల కోటి, యర్రు శ్రీనివాసరావు (ఇంటీరియర్), మిమిక్రీ శివ, పి.కిరణ్, ఆడిటర్ కళ్యాణ్ చక్రవర్తి, కానుగుల నాగేశ్వరరావు, పి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


పర్చూరి కేశవరావును సత్కరిస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

పోలీసులపై అసత్య ప్రచారాలు ఊరుకోం

● జిల్లా పోలీస్ అధికారుల సంఘం

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసేలా అసత్య కథనాలను ప్రసారం చేస్తున్న వారిని చట్టం ముందు నిలబెడతామని ఏపీ పోలీస్ అధికారుల సంఘం జిల్లా నాయకులు హెచ్చరించారు. ఆమోదయోగ్యం కానీ వార్తా కథనాలను ప్రసారం చేస్తూ ప్రజల్లో పోలీసులపై చులకన భావాన్ని ప్రేరేపించే ప్రయత్నం చేస్తున్న వారిపై తప్పకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని, వారిపై పరువు నష్టం దావా వేస్తామని, చట్ట ప్రకారం కూడా కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఎవరైనా పోలీస్ సిబ్బంది చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మీ దృష్టికి వస్తే వార్తా కథనాలను ప్రసారం చేయవచ్చు లేదా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చని, అంతే కానీ కక్షపూరిత ధోరణిలో పోలీసు సిబ్బందిపై బురద చల్లుతూ ఏదో రకంగా ప్రజల్లో ప్రాచుర్యం పొందుదామనే ఆలోచన మానుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ వారు శాంతిభద్రతల పరిరక్షణకై అసాంఘిక శక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ నిరంతరం ప్రజా క్షేమమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అటువంటి వారికి వెన్నుదన్నుగా నిలవాల్సింది పోయి పోలీసులపై అసత్యమైన ఆరోపణ చేయడం సబబు కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బేబీ రాణి, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్, కోశాధికారి హుస్సేన్, సభ్యులు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

తియ్యని రోగంతో చేదెక్కుతున్న పెన్షనర్ల జీవితాలు

గుంటూరు, మే 25(ఆంధ్రజ్యోతి): తియ్యని రోగంతో పెన్షనర్ల జీవితాలు చేదెక్కుతున్నాయని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షులు ఈదర వీరయ్య పేర్కొన్నారు. 40 ఏళ్ళు నిండిన సాధారణ వ్యక్తికి వైద్యం సమయంలో చేసే సాధారణ పరీక్షలు బిపి, షుగర్. నాలుగు పదుల ఈడు దాటిన తరువాత కనీసం 50 శాతం మందికి ఈ వ్యాధులు వస్తుంటాయనేది వైద్యులు ధృవీకరిస్తున్న వాస్తవమన్నారు. అయితే ప్రస్తుతం పంథా మారుతుందని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వీటిబారిన పడుతూనే ఉన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో మధుమేహ వ్యాప్తిలో రాష్ట్రం 4వ స్థానంలో నిలిచిందని వివరించారు. 2005 నాటికి 26 లక్షల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులుండగా 2018 నాటికి తాజాగా ఈ సంఖ్య 50లక్షలకు చేరిందన్నారు. వీరిలో 40 ఏళ్ళ లోపు ఇన్సులిన్ హార్మోన్ తగ్గటం వస్తున్న వారి సంఖ్య 40 శాతంగా ఉందని, మధుమేహ వ్యాధిగ్రస్తులు సాధారణంగా నిత్యం ఒకే తరహ మాత్రలు వేసుకుంటుండాలన్నారు. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ తగిన వ్యాయామం చేస్తూ ధైర్యంగా ఉంటే మధుమేహం వ్యాధిని జయించవచ్చని పలువురు వైద్య నిపుణులు వెల్లడిస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాధిగ్రస్తులు అవగాహనతో మసలు కోవాలని వీరయ్య తెలిపారు.


బీజేపీ కిసాన్ మోర్చా గుంటూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న నేతలు

రైతు సంక్షేమం లేనిదే రాష్ట్రాభివృద్ధి లేదు

● బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం లేనిదే రాష్ట్రాభివృద్ధి జరగదని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా గుంటూరు జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కుమార స్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతు సంక్షేమం, రైతు అభివృద్ధి కోసం వ్యవసాయానికి అనేక రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తూ రైతు అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని పని చేస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లోనూ కిసాన్ మోర్చా కమిటీలను ఏర్పాటు చేయాలని, తద్వారా పార్టీ సభ్యత్వాన్ని పెంచుకొని రాబోయే స్థానిక సంస్థల్లో పోటీ చేసే స్థాయికి భారతీయ జనతా పార్టీ ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, రాష్ట్ర, గ్రామ పంచాయతీ కమిటీల ఇన్‌చార్జ్ వైవీ సుబ్బారావు, రాయలసీమ ప్రాంత జోనల్ ఇన్‌చార్జ్ శరత్ కుమార్‌రెడ్డి, భీమినేని చంద్రశేఖర్, చరక కుమార్ గౌడ్, కొత్తూరు వెంకట సుబ్బారావు, వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్స్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

అమరావతి రాజధాని ఉద్యమకారుడి మృతి

● సంతాపం తెలిపిన మేయర్ నాని


చాముండేశ్వరరావు (ఫైల్)

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ఉద్యమకారుడు తల్లం చాముండేశ్వరరావు (శేఖర్) మృతి చెందారు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకొన్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) చాముండేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చాముండేశ్వరరావు, అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభమైన తర్వాత పట్నంబజారులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో 1001 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకొని మూడు రోజుల పాటు పాదయాత్ర చేశారు. అలానే సీఎంగా చంద్రబాబు తిరిగి ఎన్నిక కావాలని గత ఏడాది ఎన్నికలకు ముందు తిరుపతికి పాదయాత్రగా వెళ్లారు.

అసాంఘిక కార్యకలాపాల సమాచారం ఇవ్వండి : వెస్ట్ డీఎస్పీ

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని వెస్ట్ డీఎస్పీ అరవింద్ సూచించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోబాల్డుపేటలో సీఐ గంగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమానికి వెస్ట్ డీఎస్పీ అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నా, అక్రమంగా రవాణా చేస్తున్నా వారి సమాచార మిస్తే తగు చర్యలు తీసుకుంటా మన్నారు.

స్థలం కబ్జాపై కేసు నమోదు

నగరంపాలెంలో గల స్టాల్ గర్ల్స్ హైస్కూల్లో ఏఈఎల్‌సీ స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై విశ్రాంత జడ్జి జోసెఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. స్టాల్ గర్ల్స్ హైస్కూల్లో అంబేద్కర్ అనే వ్యక్తి సుమారు 300 చదరపు గజాల ఏఈఎల్‌సీ చర్చి స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేస్తున్నాడని ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనిపోల్స్ తొలగింపు క్లిష్టతరం

● రెండు వారాల్లో పిల్లర్ల నిర్మాణం అంటే కష్టమే

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న యూనిపోల్స్ తొలగింపు సమస్యగా మారింది. బ్రిడ్జికి ఇరువైపులా నగరపాలకసంస్థతో పాటు ఆదాయం కోసం కొన్ని సంస్థలు వాటి స్థలాల్లో వీటి ఏర్పాటుకు గతంలో అనుమతించాయి. ఇప్పుడు వాటిని తొలగించడం ఒక ప్రహసనంగా మారింది.

ఆ మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేత, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు చేపట్టాల్సి వస్తున్నది. సెయింట్ జోసఫ్ ఆస్పత్రి వైపున ఉన్న రెండు యూనిపోల్స్ తొలగింపునకు రెండు రోజుల సమయం పట్టింది. ఇంకా తొలగించాల్సినవి మరికొన్ని సెంట్రల్ డివైడర్, రైల్వే లేన్ల హద్దుకు ఆనుకొని ఉన్నాయి. గతంలో 60 అడుగుల కంటే ఎత్తులోనే యూనిపోల్స్ ఏర్పాటుకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఇప్పుడు వాటిని తొలగించడం కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చాల్సి వస్తున్నది. అరండల్‌పేట వైపున సెంట్రల్ డివైడర్‌లో ఒకటి, రైల్వేస్టేషన్ ప్రహరీకి సమీపంలో రెండు ఉన్నాయి. వాటిని తొలగించాలంటే చాలాజాగ్రత్తగా వ్యవహరించాలి. శంకర్‌విలాస్ సెంటర్‌లో ఉన్న యూనిపోల్ తొలగించా లంటే ట్రాఫిక్‌ని అరండల్‌పేట వైపునకు మళ్లించాలి. ఈ పరిస్థితుల్లో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ఆదేశించినట్లుగా రెండు వారాల్లో పిల్లర్ల నిర్మాణం ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలు కురుస్తుండటం కూడా పనులకు ఆటంకంగా మారింది.


బ్రాడీపేట వైపున ఉన్న యూనిపోల్స్


మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పోయిన వర్షాకాలంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆమె అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజవర్గంలో తాను పర్యటించినప్పుడు గుర్తించిన పలు సమస్యలపై వెంటనే అంచనాలు రూపొంచించి తనకు అందజేయమని ఆదేశించినా కొంతమంది అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యల విషయంలో నిర్లక్ష్యం తగదని, అటువంటి అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌కు ఒక బ్లూ ప్రింట్ సిద్ధం చేసి, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించేలా రూపొందించి తనకు అందజేయాలన్నారు. అదేవిధంగా 45వ డివిజన్లోని వైకుంఠధామం వద్ద రిటైనింగ్ వాల్ పనులను కాంట్రాక్టరు ఎందుకు ప్రారంభించలేదని ఆమె ఆరా తీశారు. ఎస్‌కేబీఎం స్కూల్‌లో గోడ కూలి ప్రమాదకరంగా ఉన్న విషయం తెలిసి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఏఈలు సరిగ్గా పనిచేయటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే గుంటూరు మునిగిపోవటం బాధాకరమని, వెంటనే పీకలవాగు, కాలువల మీద ఆక్రమణలు తొలగించి అవసరమైన చోట యంత్రాలను ఉపయోగించి శుభ్రపరచాలని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈలు శ్రీనివాసరావు, మధుసూదనరావు, రమేష్, ఏఈలు చైతన్య, దీప, ప్రసాద్ పాల్గొన్నారు.

లిక్కర్ కేసులో జగన్ జైలుకెళ్లడం ఖాయం

● ఏపీఐడీసీఎల్ చైర్మన్ దేగల ప్రభాకర్


దేగల ప్రభాకర్

గుంటూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర దుమారం రేపుతున్న లిక్కర్ స్కామ్ కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐ డీసీఎల్) చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పోయిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి వెళ్లలేదని, కేవలం తన ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళ్లేవారని ఆరోపించారు. కాగా ప్రస్తుత సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి వచ్చిన ప్రతిసారి రాష్ట్రానికి ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం కోసం కృషి చేస్తున్నారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులే ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక దుస్థితికి కారణమని దేగల అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా, లిక్కర్ స్కామ్ ఆరోపణలపైనా జగన్ చేస్తున్న వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగన్ పోయిన ఐదేళ్లలో ఎన్నో అక్రమాలు చేశారని ఆరోపించారు. ఆయనకు సహకరించిన అధికారులు కూడా అవినీతి కేసుల్లో జైళ్లకు వెళ్లే దుస్థితి ఏర్పడిందని అన్నారు. తన హయాంలో జగన్ రాష్ట్ర సంపదను దోచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. రూ.3,700 కోట్ల లిక్కర్ ఆదాయం ప్రభుత్వానికి కాకుండా ఆయన ఇంట్లోకి వెళ్లిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారన్ని ఆరోపించారు. ఇప్పుడు ఆ అప్పులకు రూ.లక్ష కోట్లు వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. ఖజానాను గాడిలో పెట్టి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు.

అ'పూర్వ'కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుంటూరు (తూర్పు), మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బొంగరాలబీడు, లూర్థ్ హై స్కూల్‌లో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠ్యాంశాలు బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. తమతో పాటు చదువుకుని చనిపోయిన మిత్రులకు, గురువులకు సంతాపాన్ని తెలిపారు. పాఠశాలకు కావాల్సిన ఫర్నీచర్, ల్యాబ్ పరికరాలకు అవసరమయ్యే ఖర్చును భరిస్తామని హామీ ఇచ్చారు.

SCHOLARSHIP ALERT

Satya Scholarship Program

Description: The Nehru Sidhant Kender Trust invites applications from Class 12 graduates who have scored at least 60% and are pursuing undergraduate (UG) or integrated master's programs at selected colleges/universities (Institutes) located in Ludhiana district. With full tuition coverage, this scholarship is dedicated to empowering bright, deserving students from diverse socio-economic backgrounds, helping them turn aspirations into achievements and build a future without financial barriers.

Eligibility: Open to students pursuing 3-5 year UG/integrated master's courses in eligible courses of Commerce (BBA, BCom), Engineering (BTech, B.E., B.Sc. (Engineering), BCA, B.Arch.), and Medical (MBBS, BDS, BPT, B.Sc. (Nursing), B.Sc. (Paramedics)) from select colleges/universities (Institutes) located in Ludhiana district.

- Must have passed Class 12 board exams from Ludhiana district with a minimum of 60% marks.
- Annual parents' income must not exceed INR 5 Lakh from all sources. In case of orphan students, the guardian's income should be less than INR 5 Lakh.
- Preference given to girls, athletes (state/national/international level), persons with disabilities, orphans, and children of single parents.
- Should not be a recipient of any other educational scholarship.

Prizes & Rewards: 100% tuition fee coverage for the entire course duration.

- Hostel and mess charges may be considered on a case-by-case basis if campus residence is mandatory.
- Reimbursement of partial or full tuition fees paid in the first year, transferred directly to the student's or parent's account.

Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SAT1

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000
Last Date to Apply: 20-06-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/MAFS3

దిక్సూచి
DIKSUCHI



ఐఐటీ మినహా మిగిలిన ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఐఐటీ, ఎన్ఐటీ లేదంటే రాష్ట్ర స్థాయి సెట్‌లో సాధించిన ర్యాంకుతో కోరుకున్న కాలేజీలో సీటు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి ర్యాంకు పొందిన వారికి పేరున్న సంస్థలోనే సీటు వస్తుంది. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకే అసలైన కష్టం. కాలేజీ ఎంపికలో వారంతా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అలాగే ఒకసారి చేరిన తరవాత నాలుగేళ్లు చదవాలి. ఆపై సమున్నత కెరీర్ నిర్మించుకోవాలి. భావి జీవితం బాగా ఉండాలంటే, ముందస్తు కసరత్తు చాలా అవసరం. అసలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏది మంచిదన్న ప్రశ్నతో ఈ ప్రక్రియ మొదలవుతుంది.

ఇంజనీరింగ్ కాలేజీ ఎంపికలో ఏవి కీలకం?

సాధారణంగా చాలా మంది విద్యార్థులు ఎంపిక విషయానికి వచ్చే సరికి ఓ పది ఇంజనీరింగ్ కాలేజీలను ఉజ్జాయింపుగా ఎంచుకొంటారు. ఆ క్రమంలోనే అక్కడి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు జరిగిన తీరుతెన్నులు, వార్షిక ప్యాకేజీ వివరాలు తెలుసుకుంటారు. వాటికి తోడు మరో రెండు అంశాలనూ పరిశీలించాలి. పేరున్న కాలేజీల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. ఏ కాలేజీలో ఎలాంటి విద్యను అందిస్తున్నారో, వాటి ప్రమాణాలు ఏమిటో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం వచ్చే సంస్థలకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. అసలు అలాంటి కాలేజీలకే వారు వెళ్తారు.

బ్రాండ్ ఇమేజ్

సాధారణంగా పేరున్న కాలేజీలు(బ్రాండ్ ఇమేజ్) అనగానే ఐఐటీ లాంటివి గుర్తుకు వస్తాయి. అక్కడ నాణ్యమైన విద్య లభిస్తుంది. పూర్వ విద్యార్థుల ప్రతిభ, అక్కడి ప్రొఫెసర్లు - విద్యార్థుల పరిశోధనలు ప్రామాణికంగా ఉంటాయి. మరికొన్ని కాలేజీలకూ బాగానే పేరుంటుంది. అవి ప్రామాణికాంశాలతో కాకుండా తమ ప్రచారంతో సంపాదించినవి. చిన్న కాలేజీలు, కొత్తగా ఏర్పాటైనవి ఆ స్థాయిలో ప్రచారానికి వ్యయం చేయలేవు. అందుకే కొన్ని చిన్న కాలేజీలు నాణ్యమైన విద్యను అందించినా ఆ స్థాయి ప్రచారాన్ని అందుకోలేక 'వెనుకబాట' పడతాయి. అందువల్లే కొత్త, చిన్న కాలేజీలు రిక్రూటర్లను పెద్దగా ఆకర్షించలేవు.

ఫ్యాకల్టీ

ఒక కాలేజీలోని ఫ్యాకల్టీ విద్యార్హతలు ఏమిటన్నది తప్పక పరిశీలించాలి. మొత్తం అధ్యాపకుల్లో పిహెచ్‌డి ఎంత మందికి ఉందన్నది తెలుసుకోవాలి. ఆ డిగ్రీ లేనప్పటికీ కొందరు మంచి అధ్యాపకులు ఉంటారు. అయితే, వారి సంఖ్య స్వల్పం. ఎం.టెక్ పూర్తి చేసిన వారు ఎందరున్నారన్నదీ పరిశీలించాలి. ఎందుకంటే, ఇటీవల చాలా కాలేజీల్లో బీ.టెక్ లేదంటే ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమిస్తున్నారు. అలాంటి కాలేజీల్లో నాణ్యమైన విద్యను ఆశించలేం. అధ్యాపకులు వారి ఉన్నత విద్యను ఎక్కడ పూర్తి చేశారన్నదీ చూడాలి. ప్రముఖ సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన వారి నుంచి నాణ్యమైన విద్య తప్పకుండా లభిస్తుంది. అలాగే ఆ కాలేజీలో బీటెక్ వరకు చదివి, తదనంతరం ఉన్నత విద్యను ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పూర్తి చేసుకొని ఉంటే ఆలోచించాల్సిన అవసరం లేదు.

అధ్యాపకుల సంఖ్య

నాణ్యమైన విద్యను పొందేందుకు అధ్యాపక- విద్యార్థి నిష్పత్తి అతి ముఖ్యమైంది. విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉండే తరగతి గదుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. అంటే సరిపడా అధ్యాపకులున్న కాలేజీల్లో మాత్రమే తరగతి గదిలో విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉంటుంది. అలా కాకుండా విద్యార్థుల సంఖ్యతో పొంతన లేకుండా అధ్యాపకులు తగ్గిన పక్షంలో అది వారి పని భారాన్ని పెంచుతుంది. దాంతో వారు స్వీయ పరిశోధనకు సమయం కేటాయించుకోలేరు. సరైన రీతిలో అసైన్‌మెంట్లను, ప్రాజెక్టు వర్క్‌ను విద్యార్థులకు ఇవ్వలేరు. అలాగే వాటికి గ్రేడింగ్ ఇవ్వడమనేది వారికి అత్యంత భారంగా మారుతుంది.

పరిశోధనల తీరుతెన్నులు..

కాలేజీ అధ్యాపకులు ఎవరైనా పరిశోధన చేస్తుంటే వారికి సదరు రంగాల్లో వస్తున్న మార్పులపై సరైన అవగాహన ఉంటుంది. వారు మంచి బోధనను అందిస్తారు. గొప్పగొప్ప సంస్థల్లో పరిశోధన కొనసాగిస్తున్న వారే కానవసరం లేదు. పరిశోధన రంగంలో ఉంటే బాగా బోధిస్తారని అంచనా వేయవచ్చు. పరిశోధనకు పూర్తిగా దూరంగా ఉండే వారి నుంచి మాత్రం ఉత్తమ బోధనను ఆశించడం కష్టమే. వీలైతే మొత్తం కాలేజీ కార్యక్రమాలను లేదా కనీసం తాము ఎంచుకోవాలని భావించే శాఖ పనితీరును చూడాలి. సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారా అప విషయాన్నీ చూడాలి.

వసతులు

ఇది మరో ముఖ్యమైన అంశం. చేరాలనుకునే విభాగంలో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలి. ఆధునిక పరికరాలు ఉన్నాయా? ఉంటే విద్యార్థులంతా ఒకేసారి ప్రయోగాలు చేసేందుకు సరిపడా ఉన్నాయా? లేకుంటే ఏదో మొక్కుబడిగా డిమాన్‌స్ట్రేటర్ చేసి చూపిస్తారా అన్నవి తెలుసుకోవాలి. మొత్తంగా కాలేజీలో వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. విద్యార్థుల సంఖ్యతో పోల్చినప్పుడు సగటున ఎన్ని పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయో కనుక్కోవాలి. లైబ్రరీకి 'ఈ-జర్నల్స్' ఎన్ని అందుబాటులో ఉన్నాయి? ఎంత తలసరి బ్యాండ్ విడ్త్ ఉంది? తరగతి గదిలో కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, స్క్రీన్‌లు, ఆడియో సౌకర్యం ఉందా? క్రీడల నిర్వహణ ఎలా ఉంది లాంటి అంశాలను కేవలం ఆ కాలేజీల వెబ్‌సైట్ల నుంచి మాత్రమే పొందలేం. అందుకోసం ప్రస్తుత లేదా తెలిసిన నమ్మకమైన పూర్వ విద్యార్థులతోనైనా సంభాషించడం ఉత్తమం. వీలైతే వాటి పరిశీలనకు ఆ కాలేజీని సందర్శించడం మరో మార్గం.

సంస్థ స్థితి: ఆ సంస్థకు యూనివర్సిటీ స్థాయి ఉండే పక్షంలో అక్కడ కొత్త ఆలోచనలకు, అకడమిక్ స్వేచ్ఛకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎంతకాలంగా మనుగడలో ఉందన్నదీ ముఖ్యమే.

క్యాంపస్: పూర్తి రెసిడెన్షియల్ క్యాంపస్ అయితే నేర్చుకొనే వాతావరణం అధికంగా ఉంటుంది.

కరికులమ్: సిలబస్‌ను తరచుగా మారుస్తున్నారా? అక్కడ ఎన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి? వంటివీ తెలుసుకోవాలి. కొన్ని సంస్థల్లో అనేక కోర్సులుంటాయి. అయితే బోధన బాగా ఉండకపోవచ్చు.

పాఠ్య ప్రణాళిక ఎంపిక: అక్కడ ఎన్ని ఎలక్టివ్స్ అందుబాటులో ఉన్నాయి? అవి ఉద్యోగాలకు పనికి వచ్చేవా లేక ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకరించేవా? ఆ సంస్థలోని విద్యార్థులు ఎక్కువగా ఉన్నత విద్యకు వెళ్తున్నారంటే - అక్కడ మంచి అభ్యసన వాతావరణం ఉన్నట్లే!

పోటీ పరీక్షలు: అక్కడి విద్యార్థులు గేట్/క్యాట్ లాంటి పరీక్షల్లో చూపిన ప్రతిభనూ గమనించాలి.

ఇవీ ముఖ్యమే

మనుగడ: ఆ కాలేజీ పది పదిహేనేళ్లుగా మనుగడలో ఉంటే, దాని పూర్వ విద్యార్థుల సంఘం ఉందా? ఉంటే మంచిది. లేదంటే.. ఆ కాలేజీని వారే పట్టించుకోనప్పుడు మనం ఎంచుకోవాల్సిన అవసరం ఉందా? అనేది నిర్ణయించుకోవాలి.

క్యాంపస్ ప్లేస్‌మెంట్: దీనిని పరిగణించాల్సిందే. కానీ ఈ ఒక్కదాన్నే పరిగణనలోకి తీసుకోవడం మాత్రం సరికాదు.

విద్యార్థుల కార్యక్రమాలు: నాలుగేళ్లు కేవలం తరగతి గది, ల్యాబ్‌లకే అంకితం కాలేము. కాబట్టి ఆ కాలేజీలో ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలి.

విద్యార్థి భాగస్వామ్యం: కళాశాల నిర్వహణలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తే - అది వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికితీస్తుంది. కాబట్టి దానినీ పరిశీలించాలి.

- ఇంత సమాచారం కనుగొనడం చాలా కష్టమని మీరు భావించవచ్చు. అయితే అన్ని కాలేజీల సమాచారం సేకరించాల్సిన అవసరం లేదు. కేవలం మీరు ఎంచుకోవాలని భావించే కాలేజీల గురించి సేకరిస్తే చాలు. అప్పుడు అదంత కష్టం కాబోదు. కాలేజీ వెబ్‌సైట్ కూడా ఈ విషయంలో తోడ్పడుతుంది. అందులో సమాచారం మరీ తక్కువగా ఉంటే ఆలోచించాలి. ప్రతి ఒక్కరిలో సహజ మేధస్సు అంతర్లీనంగా ఉంటుంది. అది వికసించేందుకు భౌతిక వాతావరణం తోడవ్వాలి. కుటుంబ నేపథ్యం, ఉత్తమ సహచర్యం, లక్ష్యం, ఆ దిశలో పయనం లాంటివి వికాసానికి తోడ్పడుతాయి తప్ప ఏదో ఒక కాలేజీలో విద్యాభ్యాసం చేయడం మూలంగానే అన్నీ సాధ్యం కావు. అలా అని కాలేజీ ప్రాధాన్యం తగ్గించలేం. మంచి కాలేజీలోనే విద్యార్థి ప్రతిభ వికసిస్తుందన్నది నిగ్గుతేలిన నిజం. విద్యార్థి దశలోనే అవగాహన, విశ్లేషణ, అన్వయం అనేవి అలవడతాయి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు

-కమల్ హాసన్



పదవుల కోసమో, ముఖ్యమంత్రిని అవ్వాలనే కోరికతోనో రాజకీయాల్లోకి రాలేదని సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ స్పష్టంచేశారు. మణిరత్నం దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆడియో రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'సీఎం కావాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదు. రాష్ట్ర ప్రజలకు, నా అభిమానులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వచ్చాను. అనుకున్న లక్ష్యాన్ని నిదానంగా సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. 'థగ్‌లైఫ్'ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. మేము ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. అందుకే శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే విక్రయించాం. సినిమాపై ఉన్న నమ్మకంతో మేమే డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, మా బేనరులో ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం' అని పేర్కొన్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆ నలుగురిలో నేను లేను

- అల్లు అరవింద్



"రెండు రోజుల నుంచి మీడియాలో 'ఆ నలుగురు... ఆ నలుగురు' అంటూ కొంచెం నెగిటివ్ టచ్ ఇచ్చి పదే పదే చెబుతున్నారు. 'కబంద హస్తాలతో థియేటర్లను గుప్పిట పట్టార'ని అంటున్నారు. ఆ నలుగురిలో నేను లేను. ఆ నలుగురితో నాకు సంబంధం లేదు" అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. పర్సంటేజీ విధానం అమలు చేయకుంటే జూన్ 1 నుంచి థియేటర్ల మూసివేస్తాం అంటూ ఎగ్జిబిటర్లు కొన్ని రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలను అడ్డుకోవడానికి తెరవెనుక కొందరు సినీ పెద్దలు ప్రయత్నిస్తున్నారనీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆ నలుగురిలో అల్లు అరవింద్ హస్తం ఉందంటూ మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు అల్లు అరవింద్ ఆదివారం మీడియా ముందుకొచ్చారు.

"ఆ నలుగురు' అని అనడం 15 ఏళ్ల క్రితం మొదలుపెట్టారు. కొవిడ్ సమయంలోనే ఆ నలుగురి వ్యాపారంలోంచి నేను బయటకు వచ్చాను. తెలంగాణలో నాకు ఉన్న ఏకైక థియేటర్ 'ఏఏఏ'. అది తప్ప నాకు మరో థియేటర్ లేదు. అలాగే ఒక్క థియేటర్ కూడా తెలంగాణలో నాకింద లీజులో లేదు. ఆంధ్రాలో 15 థియేటర్లు లీజులో నడుపుతున్నాం. గడువు తీరాక వాటిని కూడా వదులుకోవాలనుకుంటున్నాం. పాత అలవాటు ప్రకారం అందరూ నన్ను కూడా ఆ నలుగురిలో కలుపుతున్నారు. ఇకపై దయచేసి ఆ నలుగురి గురించి చెప్పేటప్పుడు అందులో నన్ను కలపొద్దు' అని అల్లు అరవింద్ కోరారు.

ఆ సమావేశాల్లో నేను పాల్గొనలేదు

'థియేటర్ల మూసివేతపై నిర్వహించిన సమావేశాల్లో నేను పాల్గొనలేదు. 'మేం థియేటర్లు మూసేస్తున్నాం, మీరు చర్చలకు రండి' అని అనడం నాకు నచ్చలేదు. అది ఏకపక్ష నిర్ణయం. మా వాళ్లకు కూడా వెళ్లొద్దు అని చెప్పాను. ఏదైనా సమస్య ఉంటే ముందు ఛాంబర్‌లో, గిల్డ్‌లో చర్చించి పరిష్కరించుకోవాలి. కుదరకపోతే ప్రభుత్వాన్ని కూడా కలవాలి. అన్నీ దారులు మూసుకుపోతే అప్పుడు థియేటర్ల బంద్ నిర్ణయం తీసుకొని ఉండాల్సింది. అలాగే క్యాబ్‌లో నేను, యూఎఫ్‌ఓలో సురేశ్‌బాబు భాగస్వాములం కాదు' అని అల్లు అరవింద్ వివరణ ఇచ్చారు.

పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది

"పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది. ఆయన సినిమా వస్తుంటే మేం థియేటర్లు మూసేస్తున్నాం అనడం పవన్ కల్యాణ్‌ను బెదిరించడమే. ఆయన సినిమా విడుదలవుతున్న సమయంలో థియేటర్లను మూసేస్తాం అనే దుస్సాహసం చేయకూడదు. థియేటర్ల మూసివేతపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ స్పందన సమంజసమే. పవన్ కల్యాణ్ మన ఇండస్ట్రీ నుంచి వెళ్లారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తున్నారు. అశ్వనీదత్ గారి సినిమా విడుదలైన సమయంలో టికెట్ ధరలను పెంచమని అడగడానికి మేం వెళ్లాం. 'ఛాంబర్ తరఫున వచ్చి సీఎం చంద్రబాబునాయుడు గారిని ఒకసారి కలవండి' అని ఆ సమయంలో పవన్ కల్యాణ్ చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. వెళ్లి కలిసి ఉంటే బావుండేది" అని హితవు పలికారు.


> "మాది ప్రైవేట్ వ్యాపారం. ప్రభుత్వంతో మాకు సంబంధం లేదని కొందరు అంటున్నారు. అలాంటప్పుడు మనలో పెద్దపెద్దవాళ్లందరూ గత ప్రభుత్వంలో సీఎంను మాత్రం ఎందుకు కలవాల్సి వచ్చింది?"

ఓజీ విడుదల తేదీ వచ్చేసింది



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు పవన్. రాజకీయాల్లో బిజీగా ఉన్న ఆయన ఇటీవలె ఈ సినిమా షూట్‌లోకి అడుగుపెట్టారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేశారు మేకర్స్. దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్ ఆఫ్ కుబేర




నాగార్జున, ధనుశ్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్ర టీజర్‌ను 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' అనే పేరుతో విడుదల చేశారు మేకర్స్. ప్రధాన పాత్రధారుల శక్తిమంతమైన లుక్స్, విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో జూన్ 20న విడుదలవుతోంది.

ముగిసిన కేన్స్ వేడుక.. విజేతగా ఇరానియన్ చిత్రం



ఈ నెల 13న అట్టహాసంగా ప్రారంభమైన 78వ కేన్స్ చిత్రోత్సవం శనివారం ముగిసింది. కేన్స్‌లో అత్యుత్తమ సినీ పురస్కారమైన 'గోల్డెన్ పామ్‌'ని అందుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా పలు సినిమాలు పోటీపడగా... ఈ ఏడాది ఆ ఘనతను ఇరానియన్ దర్శకుడు జాఫర్ పనాహీ తెరకెక్కించిన 'ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్' చిత్రం అందుకుంది. ఈ చిత్రంలో వహీద్ మొబస్సెరీ, మరియమ్ అఫ్షారీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ రోడ్ ట్రిప్ నేపథ్యంలో పలు మలుపులతో ఆసక్తికరంగా సాగే చిత్రమిది. 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో 'మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో' చిత్రం అవార్డు దక్కించుకుంది. 1980ల కాలంలో ఎయిడ్స్ వ్యాధిపై సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై పోరాడే 12 ఏళ్ల బాలిక కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా వీక్షకులను కదిలించింది. ఫ్రాన్స్ దర్శకుడు డియెగో సస్పెడెస్ తెరకెక్కించారు. అలాగే, మన దేశం నుంచి 'హోమ్ బౌండ్' అనే చిత్రం అన్‌సర్టెన్ రిగార్డ్‌లో ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది భారత్ నుంచి ప్రదర్శనకు ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. అయితే ఈ చిత్రానికి పురస్కారం దక్కలేదు. ఫ్రెంచ్ నటి జూలియట్ బినోచే.. భారతీయ దర్శకురాలు, 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్' ఫేమ్ పాయల్ కపాడియా తదితరులు ఈ ఏడాది జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

ఈ వేడుకల ప్రారంభోత్సవంలో అలియా భట్ పాల్గొనాల్సి ఉండగా, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆగిపోయారు. చివరి రోజు గూచి బ్రాండ్ చీరలో మెరిసి ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



విజేతలు వీరే:

గోల్డెన్ పామ్: ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్ (జాఫర్ పనాహీ)
గ్రాండ్ ప్రిక్స్: ద సెంటిమెంటల్ వాల్యూ (జొవాచిమ్ ట్రైయర్)
ఉత్తమ దర్శకుడు: క్లెబర్ మెన్‌డోన్సా ఫిల్హో (ద సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటుడు: వాఘ్నర్ మౌరా (ది సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటి: నదియా మెలిటీ (ది లిటిల్ సిస్టర్)
అన్‌సర్టెన్ రిగార్డ్: మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో (డియెగో సస్పెడెస్)

ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది



నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమికా చావ్లా, సారా అర్జున్, రోహిత్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'యుఫోరియా' నుంచి ఫై హై అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి కాలభైరవ స్వరాలు సమకూర్చడంతో పాటు పృథ్వీ చంద్ర, గాయత్రీ నటరాజన్‌తో కలసి ఆలపించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదే ఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ 'ఫై హై పాట అందరికీ నచ్చుతుంది. ఇదొక విభిన్న చిత్రం' అన్నారు.

థియేటర్లలో చూడాల్సిన చిత్రం



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'ఘటికాచలం'. నిఖిల్ దేవాదుల హీరోగా అమర్ కామెపల్లి దర్శకత్వం వహించారు. ఒయాసిస్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఎంసీ రాజు నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ నెల 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ఎస్‌కేఎన్ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది, థియేటర్లలోనే చూడండి అని ఎస్‌కేఎన్ కోరారు.


కొత్తగా..

మ్యూజికల్ లవ్ డ్రామా



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన 'నిలవే' చిత్రం పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు ఈ సందర్భంగా సౌమిత్ రావు మాట్లాడుతూ 'ఇది ఓ మంచి మ్యూజికల్ డ్రామా. కొత్తవాళ్లు కూడా మంచి చిత్రాలు తీస్తారు అని నిరూపించాలని మా ప్రయత్నం' అన్నారు. 'ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. సంగీతాన్ని ప్రేమతో చూపించాలని అనుకున్నాం. మా సినిమాను సపోర్ట్ చేయండి అని దర్శకుడు సాయి వెన్నం కోరారు.

'బలగం' అంజన్న కన్నుమూత



బలగం సినిమాలోని అంజన్న పాత్రతో ప్రజల మనసులు గెలుచుకున్న నటుడు గుడిబోయిన బాబు అనారోగ్యంతో వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో శనివారం రాత్రి ఒంటి గంటకు తుదిశ్వాస విడిచారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో పలువురు నాటక, సినిమా, సాంస్కృతిక కళాకారులు, నాయకులు, స్థానికులు ఆదివారం నివాళులర్పించారు. కమెడియన్ యెల్దండి వేణు దర్శకుడిగా, దిల్ రాజు నిర్మించిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా బాబు నటించి ఆకట్టుకున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధింత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు ఆయన 20కు పైగా సినిమాల్లో నటించారు.

-వరంగల్, (ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధాని ఉద్యమకారుడి మృతి

● సంతాపం తెలిపిన మేయర్ నాని


తల్లం చాముండేశ్వరరావు

గుంటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ఉద్యమకారుడు తల్లం చాముండేశ్వరరావు (శేఖర్) మృతి చెందారు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకొన్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) చాముండేశ్వరరావు నివాసానికి వెళ్లి మృతదేహానికి సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చాముండేశ్వరరావు, అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభమైన తర్వాత పట్నం బజారులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో 1001 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకొని మూడు రోజుల పాటు పాదయాత్ర చేశారు. అలానే సీఎంగా చంద్రబాబునాయుడు తిరిగి ఎన్నిక కావాలని గత ఏడాది ఎన్నికలకు ముందు తిరుపతికి పాదయాత్రగా వెళ్లారు.


ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ మలైకా అరోర నుంచి అవార్డును అందుకుంటున్న చిరుమామిళ్ళ మల్లికార్జునరావు(మల్లి)

వట్టిచెరుకూరు వాసికి అరుదైన అవార్డు

వట్టిచెరుకూరు, మే 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గంలోని మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు స్వర్గీయ చిరుమామిళ్ళ చెంచురామయ్య తనయుడు చిరుమామిళ్ళ మల్లికార్జునరావు(మల్లి)కు మలేషియా దేశంలో భారతదేశ ప్రముఖ మీడియా సంస్థ డీపీఐఎన్ఐకే భాస్కర్ అవార్డును ప్రదానం చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మైనింగ్ విభాగంలో పవర్ మేక్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీ ఓపీఈఆర్ఏటీఐఓఎన్ఎస్ హెడ్ జనరల్ మేనేజర్ చిరుమామిళ్ళ మల్లికార్జునరావుకు మలేషియా దేశంలో ఈ అవార్డును ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ మలైకా అరోర చేతులమీదుగా ప్రదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, వట్టిచెరుకూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


రాజేంద్రప్రసాద్ ఫైల్‌ఫోటో

పెదనందిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నవరంలో శనివారం రాత్రి పిడుగుపాటుకు వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు కథనం ప్రకారం ఎస్సీకాలనీకి చెందిన గేరా రాజేంద్రప్రసాద్ (72) ఇంటి సమీపంలో పిడుగు పడడంతో గుండెపోటు వచ్చి కుప్పలకూలిపోయి మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని పలువురు టీడీపీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయి మొండిగోడలు మిగిలిన ఇల్లు

మోరంపూడిలో అగ్నిప్రమాదం.. పూరిల్లు దగ్ధం

దుగ్గిరాల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం మోరంపూడిలో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమై మొండిగోడలు మిగిలాయి. గ్రామానికి చెందిన ఎన్ లక్ష్మికి చెందిన ఇంట్లో ఆదివారం ఉదయం మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగువారు వచ్చి మంటలనార్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. తెనాలి నుంచి అగ్నిమాపకదళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలనార్పివేశారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. చిట్టీకోసం దాచిన రూ.4లక్షల నగదు, కొంత బంగారం కూడా మంటల్లో కాలిపోయినట్లు చెప్పారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితురాలు లక్ష్మి విజ్ఞప్తి చేశారు.


చిన్నారులకు పంపిణీ చేస్తున్న స్కూల్ బ్యాగులు

చిన్నారులకు బ్యాగులు పంపిణీ

తాడేపల్లి (ఉండవల్లి), మే 25 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న చిగురు బాలల గ్రామంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల్‌సోమిరెడ్డి జన్మదిన వేడుకలు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి, వారికి స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. వైసీపీ నేతలు పాల్గొన్నారు.

కొండవీటి వాగు.. తూటికాడ మయం

● ప్రతి ఏడాది ఇదే తంతు


ఉండవల్లి గుహాలయాల సమీపంలో కొండవీటివాగులో దట్టంగా అలముకున్న తూటికాడ

తాడేపల్లి (ఉండవల్లి), మే 25 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి గుహాలయాల సమీపంలో కొండవీటి వాగులో తూటికాడ పేరుకుపోయి ఆకుపచ్చని తివాచీలా కనిపిస్తున్నది. తాడేపల్లి మండలం ఉండవల్లి నుండి లాం వరకు సుమారు 27 కిలోమీటర్ల మేర వ్యాపించివున్న కొండవీటి వాగులో తూటికాడ ఇబ్బడి ముబ్బడిగా పేరుకుపోయి వుంది. వర్షాకాలం సమీపిస్తున్నా నేటికీ తూటికాడను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. ప్రతి ఏడాది వర్షాకాలం నాటికి కూడా తూటికాడ తొలగించకుండా తాత్సారం చేస్తుండడంతో ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొంటోందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. భారీ వర్షాలు పడితే తూటికాడ వల్ల వాగులో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి నీరు వెనక్కు తన్ని పంట పొలాలు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాగులో దట్టంగా పేరుకుపోయిన తూటికాడను తొలగిస్తే కొండవీటి వాగు ఎత్తిపోతల ద్వారా నీరు కృష్ణా నదిలోకి చేరుకుని ఇబ్బందులు లేకుండా ఉంటుంది. వాగులోని తూటికాడను వెంటనే తొలగించి రైతుల ఇబ్బందులు తొలగించాలని, నీరు సజావుగా పారేటట్టు చూడాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. అలాగే గుంటూరు చానల్‌లో కూడా గుర్రపుడెక్క భారీగా పేరుకుపోయిందని, తక్షణం ప్రక్షాళన చేయాలని కోరారు.

అధ్వానంగా వంతెన రెయిలింగ్

కాగా ఉండవల్లి గుహాలయాల సమీపంలో కొండవీటి వాగుపై ఉన్న వంతెన రెయిలింగ్ అధ్వాన్నంగా తయారైంది. ఉండవల్లి, పెనుమాక వైపు నుండి రైతులు, అనేక మంది వీఐపీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నేతలు, ప్రజానీకం కూడా ఈ మార్గానే వెళుతుంటారు. ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న సీఎం చంద్రబాబు ఇంటి వద్దకు వెళ్లేందుకు కూడా అనేక మంది ఈ మార్గాన వంతెన మీదుగా వెళుతుంటారు. ఏమరుపాటుగా పాదచారులు వంతెన మీదుగా వెళితే వాగులో పడడం ఖాయం. ప్రమాదభరితంగా ఉన్న ఈ వంతెన రెయిలింగ్‌ను పటిష్ఠపరిచి వంతెనను అభివృద్ధి చేయాలని పరిసర గ్రామ వాసులు కోరుతున్నారు.


వంతెనపై దెబ్బతిన్న రెయిలింగ్


ఈమనిలో సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితులకు అందిస్తున్న కూటమి నాయకులు

ఈమనిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దుగ్గిరాల, మే 25(ఆంధ్రజ్యోతి): మండల గ్రామం ఈమని, చుక్కపల్లివారిపాలెం గ్రామాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సీఎం సహాయనిధి నుంచి సాయం కోసం అర్జీపెట్టుకున్న బాధితులకు నగదు చెక్కులను ఆదివారం అందించారు. బాధితులు నలకుర్తి నాగసునీత, జాన్వికారాణిల వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1.78 లక్షల విలువగల నగదు చెక్కును శనివారం అందించారు. ఆపదలో వున్న తాము పెట్టుకున్న అర్జీని పరిశీలించి, త్వరితగతిన నగదు మంజూరు చేసినందుకు గానూ బాధిత మహిళలు మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి, కాసరనేని కృష్ణ, అంచే మారుతీవరప్రసాద్, కాబోతు దేవదాసు, గేరా జనార్ధన్, చొప్పర రోశయ్య, కంచర్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

● జంగాల అజయ్‌కుమార్


కొత్తపేట సీపీఐ మహాసభలో ప్రసంగిస్తున్న జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి సిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళగిరి కొత్తపేట సీపీఐ శాఖ మహాసభ ఆదివారం జరిగింది. సీపీఐ సీనియర్ నేత షేక్ సుభానీ నేతలను ఆహ్వానించగా, వల్లభాపురం నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే నల్లధనాన్ని మొత్తం తీసుకొస్తానని చెప్పిన మోదీ నల్లధనం మొత్తాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థకు తరలించారని ఆరోపించారు. జగన్, చంద్రబాబు, పవన్‌లు మోదీ శిష్యులేనని ఎద్దేవా చేశారు. ఆరెస్సెస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌కు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతాంగం నడ్డి విరుస్తున్నారని, రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని విమర్శించారు. ఆగస్టు 4, 5 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు గుంటూరులోను, 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబరులో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు, నరసింహారావు, నీలం కమల పాల్గొన్నారు. అనంతరం కొత్తపేట సీపీఐ కార్యదర్శిగా వల్లభాపురం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా యాసిన్, రెబ్బా రామయ్య, కోశాధికారిగా కమలను ఎన్నుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


కొండపాటూరులో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాకుమాను, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిబిరంలో 400 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు డాక్టర్ శ్రీనిజ, డాక్టర్ మేఘనలు 272 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉందని తెలిపారు. అర్హులైన వారికి ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి తెలిపారు. ఈ శిబిరంలో రాఘవయ్య, ఎస్ రాజేంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దానబోయిన సుందరరావు యాదవ్

కడప మహానాడుకు పెద్ద ఎత్తున తరలిరండి

● దానబోయిన సుందరరావు యాదవ్

తాడేపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, తెలుగు రైతు గుంటూరు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కళ్లం బాపిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ నియోజకవర్గమైన మంగళగిరి నుండి భారీగా నేతలు, కార్యకర్తలు కడపకు తరలిరావాలన్నారు. టీడీపీ మరింత బలపడేందుకు ఈ మహానాడు దోహదపడుతుందని, ఈసారి మహానాడు వేదికగా తీసుకోబోయే నిర్ణయాలు విప్లవాత్మకంగా ఉంటాయని పేర్కొన్నారు. నేతలు అద్దంకి మురళి, కేళి వెంకటేశ్వరరావు, తాడిబోయిన భాస్కర్, ఆచారి, మస్తాన్‌వలి, గోపి సాయిచంద్ పాల్గొన్నారు.

బైకు రేసర్లకు పోలీసుల కౌన్సెలింగ్


బైకు రేసింగ్ చేస్తున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకట్

మంగళగిరి సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): బైకు రేసింగ్‌కు పాల్పడుతున్న యువతకు మంగళగిరి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్, జాతీయ రహదారిపై అతి వేగంగా వాహనాలను నడిపారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తమ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని యువతను అడ్డుకున్నారు. ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బైకులకు సైలెన్సర్లను అమర్చాలని సూచించారు. రేసింగ్‌లకు పాల్పడితే సహించేది లేదని, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



సమైక్యతా యాత్రలో పాల్గొన్న వామపక్ష నేతలు

తాడేపల్లిలో సమైక్యతా యాత్ర

తాడేపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన తర్వాత దేశ ప్రజలు మతసామరస్యాన్ని కోరుకున్నారని, ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను మట్టు పెట్టాలని కోరుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ నుండి ముగ్గు రోడ్డు వరకు సమైక్యతా యాత్ర నిర్వహించారు. పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో నేతాజీ, కాశయ్య మాట్లాడుతూ దేశ సమైక్యత, మతసామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారత్, పాకిస్తాన్ ప్రమేయం లేకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన మధ్యవర్తిత్వంతో యుద్ధం నిలుపుదల చేయడం జరిగిందని ప్రకటించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీపీఐ, సీపీఎం పాల్గొన్నారు.

రోడ్డుప్రమాద సంఘటనపై కేసు నమోదు

పెదనందిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు - బాపట్ల రహదారిలో నాగులపాడు అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం కాకుమాను మండలం గరికపాడుకు చెందిన విశ్రాంత వీఆర్వో రావి సూరిబాబు తన భార్య ప్రసన్నలక్ష్మీలు ఈనెల 20న ద్విచక్ర వాహనంపై నాగులపాడులో ఓ దేవస్థానానికి వచ్చి తిరిగి వెళ్తుండగా నాగులపాడు అడ్డరోడ్ వద్ద కొమ్మూరు వైపు నుండి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సూరిబాబుకు తలకు, కాళ్లకు, చేతులకు బలంగా తగలడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలి


పారిశుధ్య కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం గౌరవ అధ్యక్షుడు రవి

తుళ్లూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రాజధానిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెలకు రూ. 21 వేలు వేతనం ఇవ్వాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రవి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం తుళ్లూరులో పారిశుధ్య కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పలు అంశాలను చర్చించారు. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి పారిశుధ్య కార్మికులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన అమరావతి జీవన భృతి పింఛన్ వెంటనే పునరుద్ధరించాలని కోరారు. నిత్యం వీఐపీలతో రద్దీగా ఉండే రాజధాని అమరావతిలో కార్మికుల సంఖ్య పెంచకుండా ఉన్న వారితోనే వెట్టి చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం మాటల్లో చిత్తశుద్ధి లోపించిందని రవి ఆరోపించారు. ఒక్కో కార్మికుడిపై ఇద్దరు కార్మికుల పనిభారం పడుతుందన్నారు. వెంటనే కార్మికులను రెట్టింపు చేయాలన్నారు. కార్మికుల రక్షణ పరికరాలు, మాస్కులు, గ్లౌజులు, పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం ఆలసత్వం చూపితే మరో దశ పోరాటానికి రాజధానిలో పారిశుధ్య కార్మికులు సిద్ధమవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని పారిశుధ్య కార్మికుల నాయకులు ఎల్ సుఖవేణి, లక్ష్మీతిరుపతమ్మ, ఎం.మేరీ, ఎం.శేషయ్య, జోజి, పార్వతి, సునీత, మరియదాసు, ఎం.విజయకుమార్, కోటేశ్వరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధానంతర పరిణామాలు ప్రజలకు వివరించాలి


దుగ్గిరాల సీపీఎం కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఈమని అప్పారావు

దుగ్గిరాల, మే 25(ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని సీపీఎం కార్యవర్గసభ్యుడు ఈమని అప్పారావు అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని సీపీఎం కార్యాలయంలో ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ, జమ్ము సమీపంలోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ప్రభుత్వ చర్యలను ప్రజలకు తెలియజేయాలన్నారు. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుతూనే, మతసామరస్యాన్ని కాపాడాలన్నారు. దేశసమైక్యతను కాపాడేందుకుగానూ, దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జెట్టి బాలరాజు, విశ్రాంత ఆచార్యుడు బొల్లు లలితానంద, భీమవరపు అమ్మిరెడ్డి, గొర్రెపాటి శ్రీనివాసరావు, అత్తోట ధనుంజయ, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు


విశేష అలంకరణలో సోమేశ్వరస్వామి

పెదనందిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం మాసశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకొని సోమేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర్, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం చేశారు.

కార్మిక వినియోగదారుల సహకార సంఘ భవనానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కాట్రగడ్డ శివరామకృష్ణయ్య

తాడేపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని సుందరయ్య నగర్, లీలా సుందరయ్య కళా వేదిక సమీపంలో కార్మిక వినియోగదారుల సహకార సంఘ భవనానికి సీపీఎం నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ సుందరయ్యనగర్‌తో పాటు బైపాస్ రోడ్డులో 3వేల అపార్టుమెంట్లలోని ప్లాట్స్‌లో ప్రజలకు విస్తృతమైన సేవలు అందించడానికి సహకారం సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా హోల్ సేల్ ధరలకే నిత్యావసరాలు, ఆర్గానిక్ పదార్థాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి కృష్ణయ్య, చుక్కపల్లి తిరుమలరావు, హైకోర్టు అడ్వొకేట్ వెంకటేశ్వర్లు, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గాదె సుబ్బారెడ్డి, ఎం శ్రీనివాసరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,మే 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు ఫర్నీచర్ ఇస్తామని మోసంచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్ వెలువోలు వారి వీధికి చెందిన తొట్టెంపూడి నికిత్ ఈ నెల 17న ఆన్‌లైన్‌లో తక్కువ ధరకు సోఫాసెట్ ఇస్తామని చెప్పగా రూ.36వేలు పంపాడు. ఇప్పటికి సోఫాసెట్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

బహిరంగ మద్యపానం నేరం: సీఐ మల్లికార్జునరావు

తెనాలి, మారీసుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇస్లాంపేటకు చెందిన రామకృష్ణ, రెల్వేస్టేషన్ రోడ్డులో ప్రసన్నకుమార్, మణిగోపిలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తెనాలి, మారీసుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): నేడు సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలను అందించవచ్చన్నారు. వాటిని అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ తరగతులు

తెనాలి, మారీసుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యోగా శిక్షణ శిబిరాన్ని రెండో రోజు మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 21న వైజాగ్‌లో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం జరగనున్నదని, అందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 21వరకు యోగాంధ్ర ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రత్యేక శిక్షణ శిబిరంలో ట్రైనింగ్ అండ్ ట్రైనర్లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్, టీపీవో సాంబశివరావు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమావేశం

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కవిరాజా పార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా అసోసియేషన్ కోశాధికారి కామేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ అసోసియేషన్ కార్యకలాపాలు వివరించారు. సీనియర్ సిటిజన్ కార్డు, ఈహెచ్ఎస్, ఏబీహెచ్ఏ కార్డులపై అవగాహన కల్పించారు. విశ్రాంత జిల్లా రిజిస్ట్రార్ ఎ.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు, నర్రావుల ఆదినారాయణ, కోటిరెడ్డి, రామకుమార్, రామకృష్ణారావు, హనుమరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను సన్మానించారు.

31న ఓంకారాశ్రమ ప్రతిష్ఠ

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులో నిర్మించిన ఓంకారాశ్రమ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 31న జరుగుతుందని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆశ్రమ కమిటీ సభ్యులతో ఆదివారం ప్రతిష్ఠా మహోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. పరివార దేవత, శిఖర, ధ్వజ, సాక్షేశ్వర స్వామి, పార్వతీ సమేత ఓంకారేశ్వరస్వామి వార్ల ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ప్రతిష్ఠను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్నదానం జరుగుతాయన్నారు. మహేశ్వరరావు, నాగేశ్వరరావు, అనీల్, గోపి, నాగకుమార్‌శర్మ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): నాజరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. చైర్మన్ చంద్రశేఖరరెడ్డి కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించారు.



పంచముఖ ఆంజనేయస్వామికి మామిడి పండ్ల పూజ చేస్తున్న అర్చకులు

ఘనంగా హనుమత్ జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామివారికి విశేష పూజలు, మామిడి పండ్ల అర్చన, హోమం నిర్వహించారు. వైఖానస పండితులు నాగమారుతీ బృందం పూజాది కార్యక్రమాలు జరిపారు. 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సంకీర్తన బృందం సభ్యులు, ఈవో శ్రీనివాసరెడ్డి, ఉత్సవాలను పర్యవేక్షించారు.

రహదారులిలా.. ప్రయాణించేదెలా..?

- గ్రామాల్లో పూర్తిగా దెబ్బతిన్న ప్రధాన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
- ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా మలుపులు
- కనీసం హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



గోతులతో దారుణంగా ఉన్న మున్నంగి-తెనాలి రోడ్డు

కొల్లిపర, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రహదారులపై వెళ్లాలంటేనే ప్రజలు పలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు, వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో సిరిపురం నుంచి తెనాలి వెళ్లే రోడ్డు, దావులూరు నుంచి చక్రాయపాలెం వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని బురదమయంగా మారాయి. ఎప్పుడూ రద్దీగా ఉంటే ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనచోదకులు ప్రయాణించేదెలా అంటూ వాపోతున్నారు. చివలూరు నుంచి మున్నంగి వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. మున్నంగి -తెనాలి రోడ్డు పూర్తిగా దెబ్బతిని రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను నూతనంగా వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న చివలూరు-మున్నంగి రోడ్డు, బురదమయంగా మారిన సిరిపురం-తెనాలి రోడ్డు

ప్రమాదకరంగా మలుపులు

చేబ్రోలు (పొన్నూరు టౌన్), మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో మలుపుల వద్ద వాహన చోదకులు తరచూ ప్రమాదాల్లో గాయపడుతున్నారు. తెనాలి - గుంటూరు ప్రధాన





రహదారి సంగంజాగర్లమూడి కొమ్మమూరు కాలువ లాకుల వద్దనుండి శేకూరు, అనుమర్లపూడి, తంగెళ్లమూడి, కొలకలూరు ప్రధాన రహదారికి చేరేలా రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే సంగంజాగర్లమూడి లాకుల నుంచి శేకూరు వెళ్లే రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కోనేరు కట్ట వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో సూచకలు ఏర్పాటు చేసి, స్పీడ్ బ్రేకర్లు నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● కొల్లిపర, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లోని పలు రహదారులలో మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధాన రోడల్లో ఆర్అండ్‌బీ అధికారుల అలసత్వం కారణంగా ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో ప్రధానంగా దావులూరు అడ్డరోడ్డు అంజనేయస్వామి ఆలయం వద్ద, పిడపర్తిపాలెం వద్ద మలుపు వద్ద అధికారులు ఎటువంటి ప్రమాదసూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తూములూరు ఎస్టీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరికల బోర్డులు చెట్లతో మూసుకుపోయాయి. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేక వేగంగా వెళుతున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు తెలియజేసినా ఎటువంటి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరికల బోర్డులు గురించి ఏమాత్రం పట్టించుకోక పోవడంపై వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి, పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వక్ఫ్ పరిధిలోని ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీఖానా సమీపంలో అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించే షాదీఖానాకు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన మినీ మహానాడులో నియోజకవర్గంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. అలాగే ఇటికంపాడు రోడ్డులో వక్ఫ్ పరిధిలోని ఆస్తుల సమీపంలో ఉన్న పేదల భూములు కూడా నిషేధిత 22ఏ జాబితాలో చేర్చడం వలన ఆస్తుల క్రయ విక్రయాలకు పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి



అంజుమన్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

తీసుకువచ్చినట్లు చెప్పారు. పేదల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పటికే పలు ప్రాంతాలలో నిషేధిత ప్రాంతాలలో ఉన్న పేదల భూములను ఆ జాబితాలో తొలగించామన్నారు. అలాగే నిర్మాణంలో ఉండి వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఇటికంపాడు రోడ్డులో షాదీఖానా నిర్మాణం పూర్తిచేయడానికి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు.

నియోజకవర్గంలో అవసరం ఉన్న ప్రాంతాలలో షాదీఖానాల నిర్మాణం, ముస్లింల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి సహకారం అందించనున్నట్లు చెప్పారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మితం కానున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను త్వరతగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అంజుమన్ కమిటీ ద్వారా పేదల సంక్షేమానికి కమిటీ పనిచేయాలని పిలుపునిచ్చారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్, కమిటీ నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు, టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ వీరగాథ ప్రతి భారతీయుడు తెలుసుకోవాలి

● మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ వీరగాధను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలని మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి చెప్పారు. శివాజీ స్మారక సమితి హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ నాటకం ప్రదర్శించారు. విజయవాడ సాయిబాబా నాట్యమండలి కళాకారులు ఈ నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, శివాజీ ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలన్నారు. డీఎల్ కాంతారావు, వెంగళరావు, శ్రీనివాసరావు, మైలా హరికృష్ణ, మారుతీరామ్, హరివెంకట్, రామరాజు, యడ్లపాటి స్వరూపారాణి, కాటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నాటకంలోని ఓ సన్నివేశం

ప్రధాన కాలువల్లో తూటికాడ తొలగింపు

తెనాలి, మారీసుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన కాలువల్లో తూటికాడ తొలగింపు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఆదివారం పట్టణంలో ప్రధాన పంట కాలువల్లో ఒకటైన తూర్పు కాలువలలోని తూటికడను, వ్యర్థాలను జేసీబీ సాయంతో అధికారులు తొలగించారు. రానున్న వర్షాకాలానికి ప్రధాన కాలువల్లోని వ్యర్థాలను తొలగించి రైతుల పంటలకు నీరును సక్రమంగా అందించేందుకు కాలువల్లో తూటికాడ, వ్యర్థాలను తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు.



కాలువలో తూటికాడను తొలగిస్తున్న జేసీబీ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ ఉమేష్

తెనాలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ ఉమేష్ చెప్పారు. ఆదివారం రాత్రి మండలంలోని కొలకలూరు ఎస్సీ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమంలో ఆన్‌లైన్ మోసాలు, ఈవ్‌టీజింగ్, ఫోక్సో, రోడ్డు ప్రమాదాల బారినపడకుండా పాటించాల్సిన నిబంధనలు, మహిళలు, చిన్నారులకు రక్షణ చట్టాలు వంటి పలు విషయాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఉమేష్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా వేధింపులకు గురిచేసినా చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. గ్రామంలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను పోలీసులకు తెలిపాలని సూచించారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు కరోనాపై అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ చందు

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మరలా వ్యాపిస్తున్న కరోనాపై అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు తెలిపారు. మారీసుపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం కొవిడ్‌పై ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అన్ని వైద్యశాలల్లో తగినన్ని మందులు, కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మళ్లీ వ్యాపిస్తున్న కరోనా జాగ్రత్తలు, పరిణామాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శ్రీనివాస్, బుల్లియ్య, శివకుమార్, అయ్యప్ప, శంకరరావు పాల్గొన్నారు.

సినిమాకు పరిశ్రమ హోదా కల్పిస్తే మేలు: దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమాకు పరిశ్రమ హోదా కల్పిస్తూ పాలసీ ప్రవేశ పెట్టడం ఎంతో మేలు కలిగిస్తుందని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. ఆదివారం తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, జూన్ 1నుంచి ఎగ్జిబిటర్లు తలపెట్టిన బంద్ ఉపసంహరించుకోవడం సంతోషకరమన్నారు. పరిశ్రమ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సినిమాటోగ్రఫీ మంత్రి, ఉపముఖ్యమంత్రి మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. సమగ్ర సినీ పాలసీ విధి విధానాల రూపకల్పనలో ఏపీలో ఉండే సిని ప్రముఖుల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. ప్రసాద్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

తెనాలి ఖ్యాతి పెంచుతున్న శిల్పులు: కొలసాని

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): వినూత్న శిల్పాలను రూపొందించి శిల్పులు తెనాలి ఖ్యాతి పెంచుతున్నారని మానవతా సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్ చెప్పారు. సూర్య శిల్పశాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, హర్షలను సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ విదేశాలకు శిల్పాలను అందిస్తున్నారని, శిల్ప కళా రంగంలో వినూత్న పద్ధతులను సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆ రంగానికి మంచి పేరు తేవడంపై అభినందించారు. సభ్యులంతా మూడు రంగుల టోపీలు ధరించి భరతమాత విగ్రహాన్ని ఏర్పాటుచేసి సైనిక విజయాన్ని కీర్తిస్తూ దేశానికి అండగా నిలబడతామని నినాదాలు చేశారు. ఓంకార ప్రసాద్, వెంకట్, సోమయ్య శాస్త్రి, కళ్యాణి, మొవ్వా సత్యనారాయణ, బెల్లంకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న డాక్టర్ పురుషోత్తమరావు

అలరించిన అన్నమయ్య కీర్తనలు

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పద కవిత పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతి పురస్కరించుకుని ఆదివారం అన్నమయ్య పదాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేటలోని అతిథి ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆలపించిన కీర్తనలు శ్రోతలను అలరించాయి. సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు పలువురు గాయకులతో కలిసి అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఆంజనేయశాస్త్రి, వెంకటేశ్వరరావు, వంశీ, కేవీ రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు.



కుక్కలను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వీధి కుక్కల తరలింపు

తెనాలి, మారీసుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో బాబోయ్ కుక్కలు... అంటూ ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆదివారం పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులు, డాగ్ క్యాచర్స్ పట్టణంలోని 25, 26, 27వ వార్డులలోని వీధి కుక్కలను బంధించి వాహనంలో శస్త్ర చికిత్సా కేంద్రానికి తరలించారు. పట్టణంలో కుక్కల బెడదను అధికారుల దృష్టికి తీసుకొనివెళ్లి సమస్యను పరిష్కరించేదుకు కృసిచేసిన ఆంధ్రజ్యోతికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

28న కవితా పుస్తకాల ఆవిష్కరణ

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్‌లో ఈ నెల 28న కవిత్వ పుస్తకాల ఆవిష్కరణ నిర్వహించనున్నారు. సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నిర్వహించే ఆవిష్కరణ సభలో ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ పెరికల కేశవకుమార్ రచించిన ఆదిమ పౌరుడు, ఎగిరే పళ్లెం, నడిచే మంచం, ఓ కూనిరాగం కవిత్వ పుస్తకాలను ఆవిష్కరిస్తారు. జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే సభలో సాహిత్య వేత్తలు కళ్యాణ్, ఆకాష్, రవికుమార్, స్వరూపరాణి, విద్యాసాగర్, శ్రీరాములు, బ్రహ్మం, విశ్వేశ్వరరావు ప్రసంగిస్తారు.



జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో 10000లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్, 1000ఎల్‌పీఎమ్ ఆటోమేటిక్ ఆక్సిజన్ ప్లాంట్

ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఆక్సిజన్

తెనాలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్‌లు అందుబాటులో ఉన్నట్లు ఆస్పత్రివర్గాలు తెలిపాయి. ఒకేసారి 200మందికి ఆక్సిజన్ అందించే వెసులుబాటు ఉంది. 10000లీటర్ల సామర్థ్యం కలిగిన లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎమ్‌వో) ప్లాంట్ ఆసుపత్రిలో తొలిగా ఏర్పాటుచేశారు. గత కరోనా సమయంలో ఈ ప్లాంట్‌కు చైన్నె, విశాఖపట్నం వంటి ప్రాంతాల నుంచి ట్యాంకర్లద్వారా ఆక్సిజన్ సరఫరా కావాల్సి ఉండేది. అప్పుడు ట్రాఫిక్ సమస్యతో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. దీనిని అధిగమించేందుకు 1000ఎల్‌పీఎమ్ (లీటర్‌ఫర్ మినిట్) లీటర్ల సామర్థ్యం కలిగిన పీఎస్ఏ (ప్రకృతి సహజంగా తయారు చేయగల) ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ ద్వారా నిరంతరం ఆక్సిజన్ ఉత్పత్తి చేసుకోవచ్చు. అయితే ఈ ప్లాంట్ విద్యుత్‌పై ఆధారపడి పనిచేస్తుంది. దీంతో విద్యుత్ బిల్లుకూడా పెరుగుతుంది. ఈ ప్లాంట్ ఏర్పాటు అయిన తరువాత ఆక్సిజన్ సమస్యను అధిగమించారు. ప్రస్తుతం ప్లాంట్లు రెండు అందుబాటులో ఉన్నాయి. గత కరోనా సమయంలో ఈ ఆసుపత్రి ఎందరో రోగులకు వైద్యసేవలందించి మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించింది.



రాణి అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాణి అహల్యాబాయి హోల్కర్‌కు ఘన నివాళి

తెనాలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని చావావారిపాలెంలో కన్వీనర్ కటారి వాసుదేవనాయుడు ఆధ్వర్యంలో మండల ప్రెసిడెంట్ కడియాల నందకిషోర్ అధ్యక్షతన పెద్దఎత్తున బీజేపీ శ్రేణులు రాణి అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ తరిమిస అనంతాచార్యులు మాట్లాడుతూ అహల్యభాయ్ హోల్కర్ హైందవ ధర్మానికి సంబంధించి భారదేశంలోని దేవాలయాల పునరుద్ధణకు, బాటసారుల అన్న సత్రాల నిర్మాణాలకు, మహిళా సాధికారతకు ఆమె విశేష సేవలందించారన్నారు. ఆమె జీవితంలో చేపట్టిన పలు విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంద జనార్ధన్, వీరయ్య గ్రామ బీజేపీ క్రియాశీలక కార్యకర్తలు బాలిశెట్టి సాంబశివరావు, బి. పద్మావతి పలువురు బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరం

తెనాలి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని శారదా సర్వీస్ సొసైటీ భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శారద షుగర్ వ్యాధిగ్రస్థులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం 6గంటలకే ప్రారంభమైన శిబిరానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు అల్పాహారం కూడా అందజేశారు. కరోనా మళ్లీ వ్యాపిస్తున్నందున ప్రతి ఒక్కరికీ మాస్కులు పంపిణీచేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలతో పాటు నెలకు సరిపడా ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ చందన, వలంటీర్లు సేవలు అందించారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శారద